ఉష్ణోగ్రత (అంచనా)

2-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	28
తెనాలి	39	28
నరసరావుపేట	40	28
బాపట్ల	37	28
రెంటచింతల	40	28


ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రులు పయ్యావుల కేశవ్, నారాయణ, రవీంద్ర, నాదెండ్ల మనోహర్


వెలగపూడి సభా ప్రాంగణం వద్ద పసుపు జెండాలతో స్వాగతం


టీడీపీ జెండాలతో అలంకరించిన ప్రకాశం బ్యారేజి


సభా ప్రాంగణానికి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బారికేడ్లు



నవశకానికి.. నేడే నాంది

ఐదేళ్ల వైసీపీ విధ్వంస బంధనాల నుంచి విముక్తి కలిగి రాజధాని అమరావతి పునర్వికాసం దిశగా పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. అమరావతి రాజధాని నిర్మాణ పనుల పునరుద్ధరణతో రాష్ట్ర చరిత్రలో నవశకానికి శుక్రవారం బీజం పడనుంది. అందరూ ఆశగా ఎదురుచూస్తున్న రాజధాని పునర్నిర్మాణ శంకుస్థాపన పండుగ వాతావరణంలో జరుపుకునేందుకు సకల ఏర్పాట్లు జరిగాయి. వెలగపూడిలోని సచివాలయం సమీపంలో శంకుస్థాపన, బహిరంగసభకు భారీగా ఏర్పాట్లు జరగ్గా.. రాజధాని జిల్లా గుంటూరుతో పాటు సమీప బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి ప్రజలు వేలాదిగా తరలిరానున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ రానుండటం, ఒకేసారి రూ.లక్ష కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టడంతో అందరూ అమరావతివైపు ఆశగా చూస్తున్నారు. పోదం పద మోదీ సభకి.. జై కొడదాం అమరావతికి అంటూ జనం సిద్ధమవగా.. వారి రవాణా, భోజనం, తాగునీటి తదితర వసతులకు అధికార యంత్రాంగం ఎక్కడిక క్కడ విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. ఇక రాజధాని గ్రామాల్లో అమరావతి నిర్మాణ శంకుస్థాపనను ఓ మహోత్సవంలా రాజధాని రైతులు, మహిళలు భావిస్తున్నారు.



ప్రధాని మోదీ ఆవిష్కరించే పైలాన్

ప్రధాని పర్యటన సాగేదిలా...

ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం కేరళ నుంచి మధ్యాహ్నం 2.45కి గన్నవరం విమానాశ్ర యానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 2.50కి ఎంఐ-17 హెలికాప్టర్‌లో బయల్దేరతారు. మధ్యాహ్నం 3.10కి వెలగపూడి సచివా లయానికి సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. హెలిప్యాడ్ వద్ద సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రధానికి స్వాగతం పలుకుతారు. 3.20కి సభా ప్రాంగణానికి చేరుకుని 10 నిమిషాలు విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం 3.30 నుంచి 4.45 గంటల మధ్య శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారు. బహిరంగ సభ అనంతరం సాయంత్రం 4.45 గంటలకు తిరుగు ప్రయాణమై 4.50కి హెలిప్యాడ్‌కు చేరుకుని సాయంత్రం 5.15కి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు.

- అమరావతి పునర్నిర్మాణానికి ప్రధాని పునాదిరాయి
- ఏ ఆకృతిలో 20 అడుగుల పైలాన్.. ఆవిష్కరించనున్న మోదీ
- వెలగపూడిలో సభకు భారీ ఏర్పాట్లు.. లక్షలాదిగా తరలిరానున్న ప్రజలు
- రాజధానికి కొండంత భరోస ఇవ్వనున్న ప్రధాని నరేంద్రమోదీ పర్యటన

తుళ్లూరు(వెలగపూడి), గుంటూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): నేనున్నానంటూ కొండంత భరోస కల్పించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం అమరావతి పర్యటనకు వస్తున్నారు. రాజధాని చరిత్రలో 2025 మే 2వ తేదీ సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని అంతా భావిస్తున్నారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతి పునర్నిర్మాణ సభకు ఏర్పాట్లు అన్నీ పూర్తయ్యాయి. ప్రధానమంత్రి హాజరుకానుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భారీగా ఏర్పాట్లు చేసింది. వెలగపూడి రాష్ట్ర సచివాలయం పడమర వైపున భారీగా చేపట్టిన


సుందరంగా సభా ప్రాంగణం

ఏర్పాట్లను అధికారులు గురువారానికే పూర్తి చేశారు. హెలిప్యాడ్ నుంచి వేదిక వరకు ప్రధానమంత్రి కాన్వాయ్ ట్రైల్ రన్(రిహార్సల్) విజయవంతంగా నిర్వహించారు. ప్రధాని వేదికకు కుడి వైపున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి, ఎడమ వైపున పారిశ్రామికవేత్తలు ఆశీనులవడానికి ప్రత్యేకంగా వేదికలను ఏర్పాటు చేశారు. శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించి 20 అడుగుల పైలాన్‌ని ఆంగ్లంలో ఏ ఆకారంలో సీఆర్‌డీఏ నిర్మించింది. ముకుళిత హస్తాలతో నమస్కరిస్తూ అమరావతికి స్వాగతం పలుకుతున్నట్లుగా పైలాన్‌ని తీర్చిదిద్దింది. రూ.49,040 కోట్ల పనులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. ఇందులో హైకోర్టు, సెక్రటేరియట్, అసెంబ్లీ, న్యాయమూర్తుల నివాస సముదాయాలు వంటివి ఉన్నాయి. అలానే ఎమ్మెల్యేలు, మంత్రులు అఖిల భారత సర్వీసెస్ అధికారుల గృహ సముదాయం పెండింగ్ పనులకు కూడా శంకుస్థాపన చేస్తారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన వివిధ సంస్థలు ఏర్పాటు చేయబోయే కార్యాలయాల భవనాలకు కూడా పునాదిరాయి వేస్తారు. వీటితో పాటు రైలుమార్గాలు, హైవేలు, మిసైల్ టెస్టు రేంజ్, వైజాగ్‌లో యూనిటీ మాల్ వంటి పనులకు కూడా శంకుస్థాపన చేస్తారు. గ్యాలరీలన్నీ నిండినా ఇబ్బంది రాకుండా సభావేదికకు బయట వైపున ప్రత్యేకంగా టెంట్లు వేసి అక్కడ భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాట్లు చేశారు. కాగా ప్రధాని మోదీ బహిరంగ సభలో చేసే ప్రసంగంపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. అమరావతికి ఇప్పటికే కేంద్రం సాయం ప్రకటించి బ్యాంకింగ్ సంస్థల నుంచి నిధులు ఇప్పించింది. భవిష్యత్తులోనూ అమరావతికి

(మిగతా 8వ పేజీలో)

పడిలేచిన అమరావతి

ఐదేళ్ల వైసీపీ చీకటిపాలనలో నిత్యం పోరాటాలు, ఉద్యమాలతో అట్టుడికిన అమరావతి నేడు ఒక గ్లోబల్ సిటీగా రూపాంతరం చెందేందుకు సిద్ధమైంది. మూడు రాజధానుల కుట్రతో కునారిల్లిన ఆంధ్రుల కలల రాజధాని అమరావతి మళ్లీ జీవం పోసుకుంటున్నది. 2014-2019 మధ్యలో అప్పటి టీడీపీ ప్రభుత్వం పలు కీలకమైన పనులను ప్రారంభించింది. సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ భవనాల నిర్మాణంతో పాటు ఉన్నత స్థాయి అధికారులకు, ప్రజాప్రతినిధులకు అవసరం అయిన వసతి భవనాలను చాలా వరకు పూర్తి చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమరావతి పనులను నిలిపేసి.. మూడు రాజధానుల డ్రామా తో ఐదేళ్లు కాలక్షేపం చేసింది. ఈ క్రమంలో అమరావతికి భూములు ఇచ్చి న రైతుల చిరకాల పూజలు ఫలించి రాజధాని రూపకర్తగా ఉన్న చంద్రబాబునాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చంద్రబాబు నాయుడు గెలవడంతోనే అమరావతి మళ్లీ ఊపిరి పోసుకుంది.

మూడు ముక్కలాటలో ఎందరో బలి

జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే మొదలుపెట్టిన మూడు ముక్కలాటలో వందల మంది రైతులు అశువులు బాశారు. తీవ్ర ఆవేదనకు గురైన ఆ గుండెలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. వారి కుటుంబాలు ఛిద్రమైపోయాయి. రాజధాని కోసం భూమిని అప్పగించిన వారి త్యాగమే వారి పాలిట మృత్యుపాశమైంది. రాజధానిగా అమరావతి ప్రకటన సమయంలో ప్రతిపక్ష నేతగా ఉన్న వైసీపీ అధినేత జగన్ సంపూర్ణ ఆమోదం తెలిపారు. దీంతో రైతులు ఎలాంటి సందేహాలు లేకుండా భూములు ఇచ్చేశారు. ఎన్నికల సమయంలో రాజధాని తరలింపుపై రైతుల్లో అనుమానాలు రేకెత్తగా.. జగన్మోహన్‌రెడ్డి ఇక్కడే తాడేపల్లిలో ఇల్లు కట్టుకున్నానని, రాజధాని ఎక్కడికీ పోదని అధికార పార్టీ నేతలు నమ్మించారు. ఎన్నికల అనంతరం అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి అదే ఏడాది డిసెంబరులో చేసిన మూడు రాజధానుల ప్రకటనతో రైతులు హతాసులయ్యారు. అమరావతే రాజధాని కావాలంటూ గ్రామ స్థాయిలో మహిళలు, రైతులు చేపట్టిన ఉద్యమం గత ఐదేళ్ల మహోద్యమంగా సాగింది. రాజధాని పరిధిలోని 33 గ్రామాలకు చెందిన అన్నివర్గాల ప్రజలు చేపట్టిన ఉద్యమం ఉవ్వెత్తున సాగింది. అయినా వెనక్కి తగ్గని వైసీపీ ప్రభుత్వం తీరుతో అనేక మంది రైతులు అశువులు బాశారు. భూములు ఇచ్చి మనోవేదనతో దొండపాడులో 25 మంది, అనంతవరంలో 12 మంది, మల్కాపురంలో 23 మంది, తుళ్లూరులో 20 మంది, మందడంలో 19 మంది, వెలగపూడిలో 17 మంది, బేతపూడిలో ఆరుగురు, ఐనవోలులో 14 మంది, నీరుకొండలో 13 మంది, నేలపాడులో 12మంది రాయపూడి, ఎర్రబాలెంలో 10 మంది, కృష్ణాయపాలెంలో ఏడుగురు, కురగల్లు, వెంకట పాలెంలో ఐదుగురు చొప్పున, లింగాయపాలెంలో నలుగురు, నవులూరు, నిడమర్రు, నెక్కల్లు ముగ్గురు పెద్దపరిమిలో నలుగురు చొప్పున, తాళ్లాయపాలెం, అబ్బరాజుపాలెం, బోరుపాలెంలో ఇద్దరు చొప్పున రైతులు, రైతుకూలీలు, కౌలుదారులు మరణించారు. ఇవే కాకుండా ఇంకా గుర్తింపులోకి రాని మరణాలు మరో 50 వరకూ ఉంటాయని రైతులు చెబుతున్నారు. మూడు రాజధానుల ప్రకటన రాజధాని రైతులనే కాదు, ఆ ప్రాంతంలోని రైతు కూలీలను, ఇతర వృత్తులవారిని కూడా ఆవేదనకు గురిచేసింది. ఒకవైపు రైతుల ప్రాణాలు పోతున్నా రైతుల గుండె ధైర్యం జారిపోలేదు. పట్టుదలగా 1631 రోజులపాటు పోరాటాన్ని కొనసాగించి, ఎన్నికల్లో వైసీపీ ఓటమికి ఊరూరు తిరిగి ప్రచారం చేసి కోరుకున్న ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకున్నారు.



విధ్వంసం నుంచి పునర్వికాసం

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ మూడు రాజధానుల పేరు చెప్పి అమరావతిని నాశనం చేసింది. అంతకుముందు టీడీపీ ప్రభుత్వం చేపట్టిన పనులను నిలుపుదల చేయించింది. కేంద్ర సంస్థలకు కూడా భూములివ్వలేదు. అమరావతితో అనుసంధానమైన జాతీయ రహదారి, నూతన రైలుమార్గం పనులకు సహకరించలేదు. మూడు రాజధానులు అని ఒకవైపు చెబుతూ.. అమరావతిని కనీస రాజధానిగా కూడా గుర్తించకుండా అభివృద్ధి విఘాతానికి పాల్పడింది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ అమరావతిపై ఆశలు ఏర్పడ్డాయి. గత ఐదేళ్ల విధ్వంసాన్ని సరిచేయడానికి అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఐకానిక్ భవనాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అయినా మొక్కవోని ధైర్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఐఐటీ నిపుణులతో పరీక్ష చేయించింది. యాక్షన్ ప్లాన్‌ను తయారు చేసుకుని కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిధులను స మీకరించుకుని అమరావతి పునర్నిర్మాణ పనుల దిశగా అడుగులు పడ్డాయి. అడవిగా మారిన అమరావతిని పూర్వస్థితికి తీసుకురావడం, ఐకానిక్ కట్టడాల బేస్‌మెంట్‌లో ఉన్న నీటిని తోడేయడం వంటివి చేయడంతో పాటు సమాంతరంగా టెండర్ల ప్రక్రియను నిర్వ హించి వాటిని ఖరారు చేసి ఎల్వోఏలను ఇచ్చారు. టెండర్లు దక్కించుకున్న సంస్థలు చాలావరకు పనుల ప్రారంభానికి సిద్ధమయ్యాయి.



అమరావతి రూపురేఖలను మార్చేలా..

అమరావతికి మళ్లీ ఊపిరిలూదడంతో పాటు రూపు రేఖలను మార్చేసేలా భారీ మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.77,250 కోట్లతో పనులు నిర్దేశించారు. ఇవికాకుండా మరో రూ.30 వేల కోట్లకు

(మిగతా 8వ పేజీలో)

40 వేల మంది

- అమరావతి పీఎం సభకు భారీగా జనసమీకరణ
- ఒక్క పెదకూరపాడు సెగ్మెంట్ నుంచే 20 వేలు
- 800 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు
- ఏర్పాట్లపై కలెక్టర్ అరుణ్‌బాబు సమీక్ష

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అమరావతి రాజధాని పునర్నిర్మాణానికి శుక్రవారం జరిగే శంకుస్థాపనకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే సభకు జిల్లా నుంచి భారీగా జనసమీకరణ చేస్తున్నారు. ఇందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పీఎం సభకు తరలివెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. 40 వేల మంది సభకు హాజరుకానున్నట్లు జిల్లా యంత్రాంగం వెల్లడించింది. జనాన్ని తరలించేందుకు 800 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. భోజన.. తాగునీటి వసతిపై ప్రత్యేక దృష్టి సారించారు. సభకు తరలివెళ్లే ప్రాంతాల్లో మూడు చోట్ల భోజన కౌంటర్లు నిర్వహించనున్నారు. జన సమీకరణ ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు కలెక్టర్ పీ అరుణ్‌బాబు సమీక్షిస్తున్నారు. జన సమీకరణను జిల్లా యంత్రాంగం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ప్రత్యేక అధికారిగా జాయింట్ కలెక్టర్ సూరజ్‌ను నియమించారు.

ప్రధానంగా పెదకూరపాడు నియోజకవర్గం నుంచి అత్యధికంగా జనసమీకణ చేయాలని నిర్ణయించారు. ఈ సెగ్మెంట్ నుంచి 20 వేల మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. సత్తెనపల్లి, నరసరావుపేట, గురజాల, చిలకలూరిపేట నియోజకవర్గాల నుంచి కూడా ఎక్కు వ మంది సభకు తరలివెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు. గ్రా మ, వార్డు స్థాయిలో కూడా ప్రజలను సభకు తరలించేందుకు ఒక్కొక్క అధికారిని నియమించారు. పెదమద్దూరు.. బోయపాలెం.. నందిగామ వద్ద భోజన కౌంటర్‌లను ఏర్పాటు చేస్తున్నారు. బస్సులో కూడా తాగు నీరు.. అల్పాహారం అందించనున్నారు.

జనసమీకరణ ఏర్పాట్లపై కలెక్టర్ పీ అరుణ్‌బాబు అధికారులతో సమీక్షించారు. ప్రతి బస్సులో మెడికల్ కిట్లతో పాటు ఒక ఆశా వర్కర్‌ను నియమించాలన్నారు. ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించి కలెక్టరేట్‌లో ప్రత్యేక కాల్ సెంటర్‌ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ఆయా వ్యవహారాలను జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేను నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు సంబంధిత అధికా రులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దీనికి సంబంధించి రూట్ మ్యాప్‌ను ఆర్అండ్‌బీ శాఖ ఈఈ రాజా నాయక్ నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం

నరసరావుపేట కల్చరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని కలెక్టర్ అరుణ్‌బాబు ప్రారంభించారు. కలెక్టర్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కొద్దిసేపు షటిల్ బాడ్మింటన్ ఆడారు. అనంతరం క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. 30 రోజుల పాటు జరిగే శిక్షణలో విద్యార్థులకు బాడ్మింటన్, జూడో, బాస్కెట్‌బాల్, క్రికెట్, వాలీబాల్ క్రీడల్లో శిక్షణ ఇస్తామని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి పి.నర్సింహారెడ్డి తెలిపారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన 8 నుంచి 14 సంవత్సరాల వయసుగల బాలబాలికలకు శిక్షణ ఇచ్చి వారిలోని ప్రతిభను వెలికి తీస్తామన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని 50 కేంద్రాల్లో 18 క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం క్రీడాకారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు.


షటిల్ బాడ్మింటన్ ఆడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే అరవిందబాబు

సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే

●షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగుల బకాయి జీతాలు పంపిణీ



ఉద్యోగికి నగదు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూతపడిన జంపని షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. గురువారం గుంటూరు క్యాంపు కార్యాలయంలో ఆయన 12 మంది ఉద్యోగులకు సంబంధించి బకాయి జీతాలు, ప్రావిడెంట్ ఫండ్ రూ.37.72 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూత పడిన షుగర్ ఫ్యాక్టరీ స్థానంలో నిరుద్యోగ యువతకు, రైతు కూలీలకు ఉపయోగపడే విధంగా మరో కర్మాగారాన్ని ఏర్పాటు చేసే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని సంప్రదించి, తగు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. 2014లో ఉద్యోగుల వీఆర్ఎస్‌కు ఆమోదం తెలపడంతో పాటు వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు రూ.200 కోట్లు నిధులను సమకూర్చడం జరిగిందని కానీ, ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పంపిణీకి ఆటంకం ఏర్పడిందని గుర్తుచేశారు. రూ.11 కోట్ల జీతాల బకాయిలు ఉండగా ఫేజ్-1 ద్వారా 12 మంది ఉద్యోగులకు మే డే సందర్భంగా జీతం, ప్రావిడెంట్ ఫండ్ పంపిణీ చేసినట్లు చెప్పారు. మిగిలిన వారికి త్వరలో అందించేందుకు కృషి చేస్తానన్నారు. లిక్విడేటర్ చంద్రకుమార్, ఉద్యోగుల సంఘం నాయకులు బసివిరెడ్డి, వట్టిప్రోలు యోబు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఏఎన్ఎం మృతి



రాజమణి(ఫైల్ ఫొటో)

ఫిరంగిపురం, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసరావుపేట - గుంటూరు రహదారిలో బుధవారం రాత్రి నరసరావుపేట నుంచి గుంటూరుకు బైక్‌పై వస్తున్న గాడిదపాటి రాజమణి, రవికుమార్‌ను నరసరావుపేట నుంచి అతివేగంగా వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజమణి లారీ కింద పడిపోగా వెనుక టైర్లు ఆమె దేహాన్ని ఛిద్రం చేశాయి. మృతురాలు రాజమణి ఏఎన్ఎంగా తాడికొండ మండలం మోతడక గ్రామంలో పని చేస్తున్నారు. రవికుమార్ స్వగ్రామం నరసరావుపేటలోని పాలెంనగర్‌కు వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగింది. మృత దేహానికి నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కేసు నమోదు చేసినట్లు ఫిరంగిపురం ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ గురువారం తెలిపారు.

పురుగు మందు తాగి కౌలురైతు ఆత్మహత్య



బసవయ్య(ఫైల్ ఫొటో)

పెదనందిపాడు, మే, 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుసులూరుకు చెందిన కౌలురైతు తమటం బసవయ్య (44) గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం బసవయ్య నాలుగేళ్లుగా 20 ఎకరాలు పొలం కౌలుకు తీసుకుని మిరప, మొక్కజొన్న, శనగ పంటలు సాగు చేస్తున్నారు. గతేడాది మిరప పంట చీడపీడల వల్ల పూర్తిగా నష్టం వచ్చింది. ఈ ఏడాది కూడా మొక్కజొన్న, శనగ పంటలు సాగు చేయగా దిగుబడి సరిగా రాక, గిట్టుబాటు ధరలు లేక పెట్టుబడికి చేసిన అప్పులు తీరుతాయలో లేదోనని బసవయ్య ఆందోళన చెందాడు. అప్పు ఇచ్చిన వారు తరచూ ఇళ్ల వద్దకు వస్తుండడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఉదయం భార్యతో కలిసి పొలం పనులకు వెళ్లాడు. భార్యను పొలం వద్దే వదిలి గుంటూరు వెళ్లి వస్తానని చెప్పిన బసవయ్య పుసులూరు సమీపంలోని ఓ పొలంలో విగతజీవిగా పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీసులు, కుటుంబ సభ్యులు చేరుకొని పరిశీలించగా మృతదేహం పక్కనే కూల్‌డ్రింక్, పురుగుమందు డబ్బా ఉండడాన్ని గుర్తించారు. దీంతో భార్య శివపార్వతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ మధుపవన్ కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కొడుకులు ఉన్నారు.

అమరావతిని నిర్వీర్యం చేసిన వైసీపీ

● వేలాదిగా హాజరై పునఃనిర్మాణంలో భాగస్వాములవుదాం

● రాష్ట్ర రవాణ, యువజనశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీలు

తెనాలిరూరల్, మే1(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మకంగా నిలపాల్సిన ఆంధ్ర రాష్ట్ర రాజధాని అమరావతిని గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాన్ని గుర్తుపట్టని విధంగా మార్చిందని రాష్ట్ర రవాణ, యువజనశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములిచ్చిన రైతులపై అక్రమ కేసులు పెట్టి, మహిళలపై లాఠీచార్జి చేయించిందని ఆయన మండిపడ్డారు. రాజధాని ఏదంటే చెప్పలేని విధంగా మూడు ముక్కలాట ఆడిందని, గత పాలనను ఎప్పటికీ ఆంధ్రరాష్ట్ర ప్రజలు మరిచిపోరన్నారు. గురువారం తెనాలిలోని గౌతమ్ గ్రాండ్ హోటల్లో రాజధాని అమరావతి పునఃనిర్మాణ సభకు వెళ్లే ప్రజల సౌకర్యార్థం చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, బీటీ నాయుడు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు ఇతర కూటమి నాయకులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న రాజధాని అమరావతి పునఃనిర్మాణానికి ముహూర్తం ఖరారైందని, శుక్రవారం సాయంత్రం దేశ ప్రధాని నరేంద్రమోడీ చేతులమీదుగా అభివృద్ధిపనులకు శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో 175 నియోజకవర్గాల నుండి అశేష జనవాహిని రాజధాని నిర్మాణానికి తరలి రాబోతుందని చెప్పారు. తెనాలి ప్రాంతం నుండి కూడా వేలాదిగా సభకు హాజరై విజయవంతం చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విభజిత రాష్ట్రానికి రాజధాని లేకుండా పాలన చేసిన గత ప్రభుత్వాన్ని ప్రజలు మర్చిపోలేరన్నారు. బీటీ నాయుడు మాట్లాడుతూ ప్రజలందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వైసీపీ పాలనలో పరిశ్రమలన్నింటినీ తరిమేశారు

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



యూనియన్ల నేతలతో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో పరిశ్రమలన్నింటినీ తన్ని తరిమేశారని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు విమర్శించారు. మేడే ఉత్సవాలలో భాగంగా పిడుగురాళ్ల షాదీఖానాలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. గత ఐదేళ్లలో అభివృద్ధిని గాలికొదిలేసిన జగన్.. అరాచకాలు సృష్టించడమే పనిగా పెట్టుకొని పరిశ్రమలను తరిమేసి లక్షల మందికి ఉపాధి లేకుండా చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక జగన్ ఇప్పుడున్న పరిస్థితి చూస్తే రాష్ట్రంలో ఎప్పుడు.. ఎక్కడ...ఎవరు చనిపోతారోనని ఎదురు చూస్తూ.. గద్దల్లా వాలిపోతున్నాడన్నారు. మూడుముక్కలాటతో రాజధానిని లేకుండా చేశారని, నేడు మోడీ, చంద్రబాబు ఆధ్వర్యంలో రాజధాని పునర్నిర్మాణ శుభారంభం జరుగనున్నదన్నారు. కార్మికులలో అర్హులైన వారికి ఇళ్లస్థలాలు, ఇల్లు మంజూరు చేయిస్తానని, ఆటో నగర్ ఏర్పాటుతో పాటు పార్టీకి కష్టపడి పనిచేసిన పేద కుటుంబానికి ఏడాదికి ఒక ఆటో తానే కొనిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆటో డ్రైవర్లకు యూనిఫామ్‌ను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త వెంకట సుబ్బారావు, పాండురంగ శ్రీను, సర్వేశ్వరరావు, టీఎన్ టీయూసీ అధ్యక్షుడు యరగాని వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నాటకోత్సవాలతో కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయం



కళాకారులకు నగదు పురస్కారం, మెమెంటో ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

● పల్లెకోనలో నాటకాలను తిలకించిన ఎమ్మెల్యే ఆనందబాబు

● ముగిసిన పరుచూరి రఘుబాబు నాటకోత్సవాలు

భట్టిప్రోలు (కొల్లూరు), మే 1 (ఆంధ్రజ్యోతి): కనుమరుగు అవుతున్న నాటక రంగాన్ని నాటకోత్సవాల ద్వారా మళ్లీ వెలుగులోకి తీసుకు రావడంతో పాటు కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం పల్లెకోనలో పరుచూరి రఘుబాబు స్మారక 35వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటక పోటీలు ఐదు రోజులుగా జరుగుతున్నాయి. గురువారం ముఖ్య అతిథిగా విచ్చేసిన వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కళాకారులు ప్రదర్శిస్తున్న నాటికలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సినీ రంగం ద్వారా సుపరిచితులైన ప్రముఖ రచయిత, సినీనటుడు పరుచూరి వెంకటేశ్వరరావు తన కుమారుడు రఘుబాబు స్మారకార్థం ఎన్నో ఏళ్లుగా నందమూరి తారక రామారావు కళా ప్రాంగణంలో నాటకోత్సవాలు నిర్వహిస్తూ నాటక రంగానికి పునరుత్తేజాన్ని అందిస్తున్నారన్నారు. పరుచూరి సోదరులు చేస్తున్న కృషి ఎనలేనిదని కొనియాడారు. అనంతరం నాటక ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులకు నగదు పురస్కారాలు, మెమెంటోలు ఎమ్మెల్యే అందజేశారు.

ముగిసిన నాటకోత్సవాలు

గురువారం రాత్రితో నాటకోత్సవాలు ముగిశాయి. తొలి ప్రదర్శన ఇచ్చిన శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరి వారి జనరల్ భోగీలు నాటికను పిటి మాధవ్ రచించగా గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. రెండవ ప్రదర్శన అభినయ ఆర్ట్స్ వారి ఇది అతని సంతకం నాటికను శ్రీస్నిగ్ధ రచించగా ఎన్.రవీంద్రారెడ్డి దర్శకత్వం వహించారు. రెండు నాటికలు ప్రేక్షకులను కట్టిపడవేసేలా కళాకారులు ప్రదర్శించారు. అనంతరం పరుచూరి విజయలక్ష్మి జీవితకాల పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నటి శివపార్వతి, నాటకోత్సవాల సమన్వయకర్త డి.రామకోటేశ్వరరావు, వ్యాఖ్యత అయినాల మల్లేశ్వరరావు, వేజండ్ల బసవపున్నారావు, సతీష్, శివరాంప్రసాద్, ఎం.రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆంధ్రా ధాన్యపు లారీలను అడ్డుకున్న పోలీసులు

● బారులు తీరిన ధాన్యపు లోడు వాహనాలు



పొందుగుల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న డ్రైవర్లు

దాచేపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రాలో పండించిన ధాన్యాన్ని మిరియాలగూడ తరలిస్తుండగా తెలంగాణ సరిహద్దు ఓడవల్లి, తంగెడ వద్ద పోలీసులు వాహనాలను అడ్డుకున్నారు. ఆంధ్రా ధాన్యాన్ని తెలంగాణ కు తీసుకు రావడానికి వీల్లేదని వాడపల్లి పోలీసులు అడ్డు కోవటంతో లారీ, ట్యాక్సీ డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. ధాన్యం లోడుతో ఉన్న నాలుగు లారీలు, మూడు డీఎంసీ వాహనాలను వాడపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. తెలంగాణలో పండించిన ధాన్యానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ధర ప్రకటించడంతో పాటు.. రాయితీలు కూడా ఇస్తోంది. రాయితీలు, మద్దతు ధర కేవలం తెలంగాణ రైతులకు మాత్రమే ఉపయోగ పడాలనేది పొరుగు రాష్ట్రప్రభుత్వ లక్ష్యం. కాగా, కొంత మంది వ్యాపారులు ఈ ప్రభుత్వ పథకాలను ఉపయోగించు కోవాలన్న ఆలోచనతో ఆంధ్రాలోని ధాన్యాన్ని తెలంగాణకు తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో తెలంగాణ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఏపీ నుంచి తెలంగాణకు వెళ్తున్న లారీ, ట్రాక్టర్ డ్రైవర్లు స్పందిస్తూ.. తాము ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ధాన్యాన్ని తరలిస్తున్నామని, తమను అడ్డుకోవడం అన్యాయమని, న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

దాచేపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): గత ఐదు రోజులుగా దాచేపల్లి అంకాళమ్మ తల్లి కొలుపులతో రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న ఎడ్ల బల ప్రదర్శన పోటీలు బుధవారం ముగిశాయి. బండలాగుడు పోటీల్లో చివరి రోజు జూనియర్ విభాగంలో తెలంగాణలోని హైదరాబాద్‌కు చెందిన డి.రోహన్ బాబు ఎడ్ల జత 3,158 అడుగులు బండ లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. రెండవ స్థానంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత 2,772 అడుగులు, మూడవ స్థానంలో గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లి గ్రామానికి చెందిన బుర్రముక్క కౌసల్యారెడ్డి ఎడ్ల జత 2,565 అడుగులు దూరాన్ని లాగాయి. నాలుగవ స్థానంలో గుంటూరు జిల్లా రూరల్ మండలం లింగాయపాలెం గ్రామానికి చెందిన యల్లం సాంబశివరావు ఎడ్ల జత 2,398, 5వ స్థానంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి, గుంటూరు జిల్లా కాకుమాను మండలం గార్లపాడు గ్రామానికి చెందిన దొడ్లపూడి గణేష్ ఎడ్ల జత 2,250 అడుగులు దూరాన్ని లాగాయి. విజేతలకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రూ2.10 లక్షలు నగదు బహుమతి అందజేశారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో చోరీ

● రెండు కేజీలకు పైగా వెండి వస్తువుల అపహరణ



ఆలయంలో పరిశీలిస్తున్న ఎస్ఐ అల్లూరి రెడ్డి

పెదకూరపాడు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చయ్యపాలెం గ్రామంలోని నాలుగు డొంకల సెంటర్‌లో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో దొంగలు పడ్డారు. రెండు కేజీలకు పైగా వెండి వస్తువులను అపహరించినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు గురువారం తెలిపారు. బుధవారం అర్ధరాత్రి వర్షం పడిన తర్వాత పథకం ప్రకారం ఆలయ ఉత్తర ద్వారం తాళం పగల గొట్టి లోపలకు వెళ్లి.. గర్భగుడి తాళం పగల గొట్టి గుడిలోని సీసీ కెమెరాలను తొలగించారని చెప్పారు. ఆంజనేయ స్వామికి అలంకరించిన కేజీ 25 గ్రాముల వెండి కిరీటం, రెండు దండల వెండి తమల పాకులు, స్వామి వారి మొలతాడు, కను బొమ్మలు, బొట్టు, జంజం, సుమారు రెండు నుంచి మూడు కేజీల వెండి వస్తువులను దొంగిలించారు. ఎస్ఐ అల్లూరి రెడ్డి దేవాలయంలో చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ పరిశీలనలో ఎక్కడా వేలి ముద్రలు పడకుండా దొంగలు కాళ్లకు, చేతులకు గ్లౌజ్‌లు వేసుకున్నారని తెలిపారు. దేవాలయం బయట జత చెప్పులను వదిలి వేశారని, రాత్రి వర్షం పడిన తర్వాత దొంగతనం జరిగి ఉంటుందని పేర్కొన్నారు. పథకం ప్రకారమే సుమారు రెండు లక్షల రూపాయలకు పైబడి వెండిని అపహరించారని కమిటీ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 514.10 అడుగులు ఉంది. ఇది 138.73 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్(కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

బీటెక్ విద్యార్థులకూ..ఎడ్‌సెట్ అవకాశం

పెదకాకాని, మే1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బీఈడీ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహిస్తున్న ఎడ్ సెట్-2025 దరఖాస్తుకు బీటెక్ విద్యార్థులకూ అవకాశం కల్పిస్తున్నట్లు ఏపీ ఎడ్ సెట్ కన్వీనర్ ఆచార్య ఏవీవీఎస్ స్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీటెక్ విద్యార్థులు మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్స్, మెథడాలజీలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 14 వరకు కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఏపీ ఎడ్ సెట్ వెబ్ సైట్ ను సంప్రదించాలని పేర్కొన్నారు.

విజ్ఞాన్స్ వర్సిటీ రిజిస్ట్రార్‌గా డాక్టర్ పీఎంవీ రావు బాధ్యతలు



రిజిస్ట్రార్ పీఎంవీ రావు

గుంటూరు(విద్య) మే1 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా డాక్టర్ పీఎంవీ రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. వర్సిటీ క్యాంపస్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముందుగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎంవీ రావు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు సిబ్బంది నియామకం, శిక్షణ, పనితీరును పర్యవేక్షిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

నేడు డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహావిష్కరణ

నరసరావుపేట టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శాసనసభ మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహావిష్కరణ శుక్రవారం ఉదయం 8 గంటలకు జరుగుతుందని మందాడి రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ కోడెల శివప్రసాదరావు నిర్మించిన ఎన్ఎస్‌పీ కాలనీలోని ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో విగ్రహావిష్కరణ రాష్ట్ర, జిల్లా కూటమి నాయకుల చేతుల మీదగా జరుగుతుందని పేర్కొన్నారు. కోడెల శివప్రసాదరావు ఆసుపత్రిలో రక్తదానం, కంటి వైద్య శిబిరాలు జరుగుతాయని తెలిపారు.

కృష్ణానదిలో మునిగి బాలుడి మృతి



బాలుడి మృతదేహం

తాడేపల్లి టౌన్, మే 1, (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తూ ఓ బాలుడు మృతి చెందిన ఘటన గురువారం తాడేపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నెల్లూరు జిల్లా వెంకటగిరికి చెందిన మురారి (14) కుటుంబ సభ్యులతో కలిసి మూడు రోజుల క్రితం మహానాడులోని కృష్ణాతీరంలో ఉన్న ధ్యాన కేంద్రం వద్దకు వచ్చాడు. బుధవారం సాయంత్రం కుటుంబ సభ్యులందరూ కృష్ణానదిలో స్నానానికి దిగారు. లోతులోకి వెళ్లడంతో ప్రమాదవశాత్తూ బాలుడు మునిగి మృతి చెందాడు. ఆ ప్రాంతంలో సుడిగుండాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. అప్పటిదాకా తమతోపాటు కేరింతలు కొడుతూ ఆడుకున్న కన్నబిడ్డ తమ కళ్లముందే అనంతలోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురువారం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'పునఃనిర్మాణాన్ని' విజయవంతం చేయాలి:చీఫ్‌విప్

వినుకొండటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ చేతుల మీదుగా జరుగుతున్న రాజధాని అమరావతి పునఃనిర్మాణ కార్యక్రమానికి నియోజకవర్గంలోని గ్రామాల నుంచి కూటమి పార్టీల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే నాయకులకు దిశనిర్దేశం చేయడం జరిగిందని పేర్కొన్నారు. సీనియర్ నాయకుల సూచనల మేరకు కేటాయించిన బస్సుల్లో జాగ్రత్తగా అమవరాతి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని, తిరిగి జాగ్రత్తగా ఇళ్లకు చేరుకోవాలని తెలిపారు.



ఏరియా వైద్యశాల ఆర్ఎంవోగా కృష్ణమూర్తి

సత్తెనపల్లి, మే 1(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ఏరియా వైద్యశాల ఆర్ఎంవోగా డాక్టర్ కృష్ణమూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. వైద్యశాలలో ఆయన మత్తు డాక్టర్‌గా పని చేస్తున్నారు. ఇప్పటివరకు ఆర్ఎంవోగా పనిచేసిన డాక్టర్ శోభారాణి ఉద్యోగ విరమణ చేయటంతో ఆస్పత్రిలో కృష్ణమూర్తికి ఆర్ఎంవో బాధ్యతలు అప్పగించారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



8వ వార్డులో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషిచేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో గురువారం ఇంటింటికి వెళ్ళి ఆయన పింఛన్‌లను పంపిణీ చేశారు. పింఛన్‌దారుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఉన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో టీడీపీ నేతలు, సచివాలయ ఉద్యోగులు పింఛన్‌లను పంపిణీ చేశారు.

● మండలంలోని రెంటపాళ్ళలో శ్రీఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామివార్ల ప్రతిష్ఠా మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. వేకువ జామునుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆలయంలో ప్రత్యేక పూజలుచేశారు. అనంతరం అన్నదానంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామ, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజధాని పునర్నిర్మాణంతో భావితరాలకు బంగారు భవిష్యత్

● టీడీపీ సీనియర్ నేత యాగంటి

మాచర్లటౌన్, మే 1(ఆంధ్రజ్యోతి): రాజధాని పునర్నిర్మాణంతో భావితరాలకు బంగారు భవిష్యత్ సాధ్యమవుతుందని టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రుల ఆత్మగౌరవం పెరిగేలా అమరావతి నిర్మాణం జరుగుతుందన్నారు. ఈనెల 2న ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా నిర్మాణ పనులు ప్రారంభించడం శుభపరిణామం అన్నారు. కూటమి నేతలు, కార్యకర్తలు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో తిరుపతమ్మ అమ్మవారి కల్యాణం

దాచేపల్లి, మే 1(ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలోని అంకమ్మ తల్లి దేవాయలంలో ఉన్న లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వాముల కల్యాణం గురువారం రాత్రి వైభవంగా జరిగింది. తొలుత కేసానుపల్లి గ్రామంలోని పోతరాజు లక్ష్మీనరసింహారావు, హిందుమతి దంపతులు అమ్మవారికి పసుపు, కుంకుమ, ముత్యాల తలంబ్రాలు అమ్మవారికి అందజేశారు. పలువురు దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా జెట్టి

రాజుపాలెం, మే 1(ఆంధ్రజ్యోతి): తాపీవర్కర్స్ యూనియన్ రాజుపాలెం అధ్యక్షుడిగా జెట్టి చిన్న కోటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం వర్కర్స్ నూతన యూనియన్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పులిబండ్ల సాంబశివరావు, కోశాధికారి చాట్ల మోహన్‌రావు, గౌరవ అధ్యక్షుడిగా జల్లేపల్లి రఘు, సభ్యులుగా తుమ్మల జన్సన్, చెవుల ప్రసన్న కుమార్, శరత్, సిద్దూ, యల్లమంద, పూల వేంకయ్య, గోపి ఉన్నారు. తొలుత మేడే సందర్భంగా జెండాను ఎగురవేశారు.

మోదీ పర్యటన విజయవంతం చేయాలి

కారంపూడి, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ శుక్రవారం అమరావతి రాజధాని పర్యటనలో వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి గోళ్ల సురేష్‌యాదవ్ కోరారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.



డాక్టర్ సౌమ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ కారసాని శ్రీనివాస్ రెడ్డి తదితరులు

మహాత్మాగాంధీ సూపర్‌స్పెషాలిటీ వైద్యశాలలో అందుబాటులో న్యూరాలజిస్ట్ సేవలు

నరసరావుపేట లీగల్, మే 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాత్మాగాంధీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో గత రెండు నెలలుగా పూర్తిస్థాయి న్యూరాలజిస్ట్ అందుబాటులో లేనికారణంగా న్యూరాలజిస్ట్ వైద్య సేవలకు అంతరాయం ఏర్పడిందని, న్యూరాలజిస్ట్ డాక్టర్ సౌమ్య తమ వైద్యశాలలో అందుబాటులో ఉంటారని వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ కారసాని శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పల్నాడు ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలకు మారుపేరుగా ఉన్న మహాత్మాగాంధీ హాస్పిటల్లో కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్‌గా సేవలందించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్ ప్రసాద్, డాక్టర్ అశ్విని, డాక్టర్ నవీన్, ప్రవీణ్, విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

మోదీ సభ ఏర్పాట్లలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● మండల ప్రత్యేక అధికారి పీ ఝాన్సీ రాణి

నకరికల్లు, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ అమరావతి పర్యటన ఏర్పాట్లలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌డీఏ పీడీ, మండల ప్రత్యేక అధికారి పీ ఝాన్సీరాణి ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో ఆమె సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి వెళ్ళే బస్సుల్లో మంచినీరు, ఆహారం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో జీ కాశయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మోదీ సభకు 510 ఆర్టీసీ సర్వీసులు

సత్తెనపల్లి, మే 1(ఆంధ్రజ్యోతి): ఈనెల 2వ తేదీ అమరావతిలో జరగనున్న ప్రధాని మోదీ సభకు సత్తెనపల్లి నియోజకవర్గానికి 90 ఆర్టీసీ బస్సు సర్వీసులు, పెదకూరపాడు నియోజకవర్గానికి 420 ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్టు స్థానిక డిపో మేనేజర్ విజయకుమార్ గురువారం విలేకరులకు తెలిపారు. సభకు వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా ఆర్టీసీ అన్ని రకాల సేవలను ఏర్పాటుచేసిందన్నారు.

శ్రామికుల సంక్షేమమే కూటమి ధ్యేయం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



సత్తెనపల్లి: వడ్డవల్లిలో మేడే వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, మే 1(ఆంధ్రజ్యోతి): శ్రామికుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని వడ్డవల్లి పోలేరమ్మ దేవాలయం వద్ద గురువారం భవన నిర్మాణ కార్మికులు ఏర్పాటుచేసిన మేడే వేడుకల్లో ఎమ్మెల్యే మేడే పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపదలకు మూలం కార్మికుల శ్వేదం అన్నారు. శ్రామికులే అభివృద్ధిలో అసలైన భాగస్వాములన్నారు. కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. మేడే పతాకాన్ని ఆయన ఎగుర వేశారు. కార్యక్రమంలో అవ్వారు ప్రసాదరావు, ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, మామిడి వెంకటేశ్వరరావు, నూర్ బాషా జాన్‌బాబు, బత్తుల వెంకటస్వామి, మారెళ్ళ మల్లేశ్వరరావు, పోట్ల ఆంజనేయులు పాల్గొన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ శేషయ్య, శివారెడ్డి, నరిచేటి వేణుగోపాల్, కంభా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలోనూ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఏరియా వైద్యశాలలో

కార్మికుల త్యాగఫలితమే మేడే అని ఏరియా వైద్యశాల హెడ్‌నర్సు బంగారు పాప అన్నారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో గురువారం మేడే వేడుకల్లో ఆమె మాట్లాడారు. పారిశుధ్య కార్మికులను సూపరింటెండెంట్ లక్ష్మణరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధా, ఆర్ఎంవో కృష్ణమూర్తి, పలువురు డాక్టర్లు ఘనంగా సన్మానించారు.

కోర్టు ఆవరణలో...

మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ విజయకుమార్‌రెడ్డి సూచనల మేరకు మార్కెట్ యార్డు ఆవరణలోని కోర్టుల వద్ద గురువారం ప్రత్యేక న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పారాలీగల్ వలంటీర్లు, కార్మికశాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో మేడే వేడుకలు

సత్తెనపల్లి రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంటపాళ్ళ, పణిదం, గుడిపూడి, నందిగామ, కందులవారిపాలెం, భీమవరం గ్రామాల్లో వేడుకలు సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పెండాల మహేష్, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు రావూరి పూర్ణచంద్రరావు, మక్కపాటి నరసింహారావు, వ్యవసాయ కార్మిక సంఘ మండల అధ్యక్ష, కార్యదర్శులు జే భగత్, ఎం వెంకటేశ్వర్లు, సీఐటీయూ, ప్రజాసంఘాలు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల త్యాగఫలితమే మేడే..

ముప్పాళ్ళ, మే 1(ఆంధ్రజ్యోతి): కార్మికుల త్యాగాల ఫలితమే మేడే అని సీపీఎం మండల కార్యదర్శి గుంటుపల్లి బాలకృష్ణ అన్నారు. మండలంలోని నార్నెపాడు, మాదల, ముప్పాళ్ళ గ్రామాలలో కార్మిక జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కందిమళ్ళ సాంబశివరావు, తొరటి అమరలింగేశ్వరరావు, పటాన్ సైదాఖాన్, గారా జాలయ్య, నూకారపు సాంబశివరావు, మార్పుల వెంకటరెడ్డి, కూరపాటి ప్రభాకరరావు తదితరులున్నారు.

ఘనంగా మేడే వేడుకలు



క్రోసూరు: సీపీఎం కార్యాలయం వద్ద జెండాను ఎగుర వేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

క్రోసూరు, మే 1(ఆంధ్రజ్యోతి): మేడే వేడుకలు గురువారం క్రోసూరులో ఘనంగా జరిగాయి. సీపీఎం కార్యాలయం నుంచి విజ్ఞానకేంద్రం వద్ద సీపీఎం జెండాను పలు కార్మిక సంఘాల నాయకులు ఎగురవేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గంజిమాల రవిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు హనుమంతరావు, యూటీఎఫ్ నాయకులు ప్రకాశరావు, నరసింహారెడ్డి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు శివపార్వతి, విజయమ్మ, భవన, నిర్మాణ సంఘం నాయకులు మల్లికార్జునరావు, ఏసయ్య, సీఐటీయూ మండల అధ్యక్షుడుమురళీ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట మండలంలో..

అచ్చంపేట, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకుపాలెం గ్రామంలో కేవీపీఎస్ మండల కార్యదర్శి కత్తుల గోపీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు జీ రవిబాబు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిలక పెద్దసుబ్బారావు, మండల రైతు సంఘ నాయకులు ఆర్ వెంకటేశ్వర్లు, సుంకర ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడు మండలంలో...

పెదకూరపాడు, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకూరపాడు, లగడపాడు గ్రామాల్లో మేడే వేడుకలు నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పలుచోట్ల జెండాలను కార్మికులు ఎగురవేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో..

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): మేడే పర్వదినాన్ని అమరావతిలో ఘనంగా నిర్వహించారు. సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో వేర్వేరుగా మేడే జండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.సూరిబాబు, సీపీఐ నాయకులు బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అలుపెరగని సూరీడు కార్మికుడే..



కారంపూడిలో నిర్వహిస్తున్న మేడే వేడుకలు

మాచర్ల రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లో గురువారం మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. జెన్‌కో క్వార్టర్స్ వద్ద ఏఐటీయూసీ మాచర్ల నియోజకవర్గ కార్యదర్శి మిద్దె పోగు బాబురావు జెండా ఆవిష్కరించారు. అలాగే లాంచీ స్టేషన్ వద్ద ఏపీ టూరిజం కాంట్రాక్ట్ మ్యాన్ పవర్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పులుసు వీరారెడ్డి, అంబేడ్కర్ సెంటర్‌లో ఆటో యూనియన్ ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్లా ఆధ్వర్యాన జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్మికులు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో స్థానిక ఏఐటీయూసీ సెక్రటరీ తుమ్మనాథంరెడ్డి, భవన నిర్మాణ సంఘ అధ్యక్షుడు బీ నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఆంజనేయులు నాయక్, ఇశ్రాయేలు పాల్గొన్నారు.

● మాచర్లటౌన్, మే 1(ఆంధ్రజ్యోతి): మాచర్లలో గురువారం మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్ ఆంజనేయులునాయక్ జెండాను ఆవిష్కరించారు. సీఐటీయూ, మున్సిపల్ కార్యాలయం, కేసీపీ కాలనీ, అంబేడ్కర్ సెంటర్లలో మేడే వేడుకలు జరిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బండ్ల మహేష్, సురేష్, వెంకటరత్నం, బత్తుల మహేష్, వేముల వెంకట్రావు, కొమెర రమణ, విజయ్, సుధాకర్ పాల్గొన్నారు.

కారంపూడిలో...

కారంపూడి, మే 1(ఆంధ్రజ్యోతి): కారంపూడిలో సీపీఐ ఆధ్వర్యాన మేడే వేడుకలు ఘనంగా జరిపారు. ఆదినారాయ స్థూపం వద్ద మాచర్ల ఏరియా కార్యదర్శి మేకపోతు శ్రీనివాసరెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఆదినారాయణ కాలనీలో సీపీఐ పట్టణ కార్యదర్శి సూరె హనుమంతరావు, బస్టాండ్ వద్ద మండల కార్యదర్శి షేక్ సైదా ఆధ్వర్యాన వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో మేకపోతు చినకోటిరెడ్డి, గాలం శ్రీను, సుభాని, చెన్నయ్య, ఏకే నాగమణి, ఏఐటీయూసీ నేత నూనె వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ నేత జింకల కోటేశ్వరరావు, లింగేశ్వరరావు, నూర్ హర్షద్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. కారంపూడి శివారులోని శ్రీచక్ర సిమెంట్ కర్మాగారంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేడే జెండాను ఎగురవేశారు. ఎందరో మహనీయుల త్యాగఫలమే మేడే అని ఫ్యాక్టరీ యాజమాన్యం అన్నారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ యాజమాన్యం, కార్మికులు పాల్గొన్నారు.

దుర్గిలో..

దుర్గి, మే 1(ఆంధ్రజ్యోతి): దుర్గిలో సీఐటీయూ, సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యాన మేడేని ఘనంగా నిర్వహించారు. చెక్‌పోస్టు వద్ద సీఐటీయూ ఆధ్వర్యాన పంచాయతీ, ఫ్యాక్టరీ, భవన నిర్మాణ కార్మికులు వేడుకలను జరుపుకున్నారు. బస్టాండ్ సెంటర్లో సీపీఐ నేతలు ఎర్ర జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో మాచర్ల మహేష్, చిట్టిపోలు ఆంజనేయులు, జొన్నలగడ్డ బాబు, సుబ్బయ్య, దుర్గారావు, వలి, అమరేశ్వరరావు, కె.శివయ్య, కె.గిరి పాల్గొన్నారు.

రెంటచింతలలో..

రెంటచింతల, మే 1(ఆంధ్రజ్యోతి): అలుపెరగని సూరీడు కార్మికుడేనని సీపీఐ మండల కార్యదర్శి కేతావత్ రంగనాయకులు అన్నారు. రెంటచింతలలో ఎర్రజెండాలను పలుచోట్ల ఆవిష్కరించారు. చైతన్య నాపరాయి క్వారీవర్కర్స్ ఆధ్వర్యంలో మేడే జరిపారు. కార్యక్రమంలో ఎం.పెదసామ్యేల్, డి.థామస్, డి.శ్రీనివాసరావు, శివ, నాగార్జున, లాజర్ పాల్గొన్నారు.



దుర్గిలో నిర్వహిస్తున్న మేడే వేడుకలు

కార్మికుల ఐక్యతే హక్కులకు రక్ష



దాచేపల్లి: నారాయణపురంలో వేడుకల్లో పాల్గొన్న కూటమి నాయకులు

దాచేపల్లి, మే 1(ఆంధ్రజ్యోతి): కార్మికుల ఐక్యంగా ఉంటేనే తమ హక్కులకు రక్షణ ఉంటుందని టీడీపీ సీనియర్ నాయకుడు నర్ర పుల్లయ్య అన్నారు. మేడే సందర్భంగా నారాయణపురంలోని మైనింగ్‌క్వారీ వద్ద గుల్ల క్వారీ కార్మికులు జెండాను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పుల్లయ్య మాట్లాడారు. అనంతరం నడికూడిలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ గద్దల వేదమణి ఆధ్వర్యంలో అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. పెదగార్లపాడులో సీపీఎం నాయకులు బ్రహ్మం, రాజు, మిరియాల శ్రీను, సాంబయ్యల ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. నారాయణపురంలో సీపీఐ కార్యాలయం వద్ద అరుణపతాకాన్ని మందపాటి రమణారెడ్డి ఆవిష్కరించారు. ఆ యా కార్యక్రమాల్లో సొసైటీ నారాయణ, పగడాల భాస్కరరావు, వేముల కృష్ణ, అక్కినపల్లి బాలయ్య, తమ్మిశెట్టి నరసింహారావు, కత్తుల నరసింహారావు, వలి, నాయ బ్ అబ్దుల్లా, వెంకటరావు, మైనార్టీ నాయకులు తుల్లా, మాజీ ఎంపీటీసీ తోట వెంకటేశ్వర్లు, అంబటి మల్లి, నడికూడి టర్నింగ్‌లో మోమిని సైదిల్లి, వేముల కృష్ణ, వేముల ఏడుకొండలు, కౌన్సిలర్లు షరీఫ్, తమ్మిశెట్టి నరసింహారావు, బండారి వెంకటేశ్వరరావు, పల్లపు సాంబ, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

● పిడుగురాళ్ల, మే 1(ఆంధ్రజ్యోతి): పట్టణ వైసీపీ కార్యాలయంలో గురువారం జరిగిన మేడే వేడుకలలో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.కార్యక్రమంలో రేపాల శ్రీనివాసరావు, డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో...

సీఐటీయూ ఆధ్వర్యంలో పిల్లుట్ల రోడ్డులోని ఆటో పాయింట్ వద్ద మేడే వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, సీఐటీయూ నాయకులు తెలగపల్లి శ్రీను, జయరాజ్, మొగిలి ప్రతాప్, వెంకటకృష్ణ, వడ్డెంగుంట సాంబయ్య, కొమ్ము పుల్లయ్య, బత్తుల వెంకటేశ్వర్లు, రామారావు, రామకృష్ణ, యాకోబు, తిరుపతిరావు, జయశ్రీ, శాంతమణి, లక్ష్మీ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల నిర్వాసితులకు రిజిస్ట్రేషన్ పత్రాలు



పులిచింతల నిర్వాసితులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): పులిచింతల నిర్వాసితులకు న్యూవెల్లంపల్లి, అయ్యప్పనగర్ ప్రాంతాలలో కొత్త గ్రామాలను ఏర్పాటుచేశారు. వారందరికీ అప్పుడు పట్టాలు పంపిణీ చేసినా స్థలాలు, ఇళ్లు అమ్ముకునే హక్కు కల్పించలేదు. కూటమి ప్రభుత్వం నిర్వాసితుల పేరిట స్థలాలను, ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయించి పత్రాలు అందజేసే కార్యక్రమాన్ని చేపట్టింది. న్యూ వెల్లంపల్లి, అయ్యప్పనగర్ ప్రాంతాలకు చెందిన 64మంది నిర్వాసితులకు గురువారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. పునరావాస ప్రాంతాలలో మౌలికవసతుల కల్పనకు కృషిచేస్తానని ఆయన తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని మందులగడ్డ ప్రాంతంలో 11 మంది ముస్లిం కుటుంబాలకు గతంలో కూల్చివేసిన ఇళ్ల స్థానంలో హైకోర్టు ఆదేశాల మేరకు పట్టాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమాలలో తహసీల్దార్ జె.మధుబాబు, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, షేక్ బాబావలి, కనిగిరి శ్రీను, ఏఎంసీ చైర్మన్ తురకా వీరస్వామి, గండికోట వెంకటేశ్వర్లు, పిల్లి చెన్నారావు, ముప్పాళ్ల సాంబయ్య, కార్ సైదా, వల్లెపు రామకృష్ణ, ముప్పాళ్ల రమేష్, పణితి రవి, సయ్యద్ అమీర్‌అలి, వడ్డవల్లి సాంబశివరావు, కారుకోళ్ల నాగరాజు, వున్నం సురేష్, పాల శ్రీను పాల్గొన్నారు.

పింఛన్లను అందజేసిన ఎమ్మెల్యే యరపతినేని

పట్టణంలోని 11వ వార్డుకు చెందిన పలువురికి ఎమ్మెల్యే యరపతినేని వృద్ధాప్య, వికలాంగుల, వితంతు పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.శ్రీధర్, వివిధ శాఖల అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

మోదీ సభకు బస్సుల ఏర్పాటు

పిడుగురాళ్ల, మే 1(ఆంధ్రజ్యోతి): అమరావతిలో మోదీ సభకు గురజాల నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుండి కూటమి నేతలు, మహిళలు, యువత తరలివెళ్లనున్నారు. ఇందుకు ప్రతి గ్రామానికి ఒక బస్సు చొప్పున మండలానికి 28 బస్సులను కేటాయించారు. ప్రతి బస్సుకు 50మంది వుండేలా, ప్రతి బస్సుకు ఇద్దరు అధికారులను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. ఎమ్మెల్యే యరపతినేని కూడా కూటమినేతలను మరికొందరిని ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, పట్టణం నుండి కూటమినేతలు, యువత, మహిళలు హాజరయ్యేలా పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. కమిషనర్ పి.శ్రీధర్, తహసీల్దార్ జె.మధుబాబు, ఎంపీడీవో రామచంద్రరావులతో ఎమ్మెల్యే సమీక్షించి బస్సులు తిరిగి క్షేమంగా చేర్చేలా సూచనలు చేశారు.

అమరావతి సభకు భారీగా జన సమీకరణ

మాచవరం, మే 1(ఆంధ్రజ్యోతి): అమరావతిలో శుక్రవారం నిర్వహించనున్న ప్రధాని మోదీ సభకు మండలంలోని కూటమి శ్రేణులు భారీగా తరలివెళ్ళేందుకు సిద్ధమయ్యారు. మాచవరం మండలానికి 12 ఆర్టీసీ బస్సులు కేటాయించారు. ఆయా బస్సుల్లో డ్వాక్రా మహిళలు, కూటమికి చెందిన మహిళలు వెళ్ళేందుకు సిద్ధమవుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీల తరఫున ఆయా గ్రామాల నుంచి పార్టీశ్రేణులు వివిధ వాహనాల్లో తరలివెళ్ళేందుకు ముమ్మర ఏర్పాట్లుచేస్తున్నారు.

రూ.6.05కోట్లతో పిల్లివాగుపై హైలెవల్ బ్రిడ్జికి ప్రతిపాదనలు

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల, మే 1(ఆంధ్రజ్యోతి): పాలువాయి పిల్లివాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.6.05 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపినట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. బుధవారం రాత్రి పాలువాయి గ్రామంలో పర్యటించారు. సమావేశంలో సర్పంచ్ మందలపు విజయలక్ష్మి లచ్చిరెడ్డి, హనిమిరెడ్డి, శౌంఠిరెడ్డి నాగమ్మ నర్శిరెడ్డి, తేలుకుట్ల కోటిరెడ్డి, సుమంత్‌రెడ్డి, అల్లం బ్రహ్మారెడ్డి, తుఫాన్‌రెడ్డి, కె.సాంబ, కోటేశ్వరరావు, జి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పక్షం కూటమి లక్ష్యం..

మాచర్లటౌన్, మే 1(ఆంధ్రజ్యోతి): కార్మికుల పక్షమే కూటమి లక్ష్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా అన్ని రంగాల కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో కార్మిక వ్యతిరేక విధానాలను రద్దు చేసి వారికి వెన్నుదన్నుగా నిలబడేలా కొత్త రకం పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని తీసుకురావడం ద్వారా భవన రంగ కార్మికులతోపాటు ఆధారిత రంగాల కార్మికులను సైతం ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు తీసుకొచ్చి అన్ని ప్రాంతాల్లో పారిశ్రామిక తోడ్పాటునిచ్చి పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు.

బైకు అదుపుతప్పి యువకుడు మృతి




శ్రీకాంత్ మృతదేహం

మాచర్ల రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): బైకు అదుపుతప్పి యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని పశువేముల వద్ద గురువారం జరిగింది. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన అమరబోయిన శ్రీకాంత్(23) పొలం పనులు చేస్తుంటాడు. ఉదయం మాచర్ల వెళ్లేందుకు బైకుపై బయలుదేరాడు. మార్గమధ్యంలో పశువేముల గ్రామం వద్దకు రాగానే బైకు అదుపుతప్పి రాయిపై పడ్డాడు. తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.విజయపురిసౌత్ పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుమారుడు మృత్యువాత పడడంతో తండ్రి రామకృష్ణ, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

మోదీ సభకు వేలాదిగా తరలిరండి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



టీడీపీ ముఖ్య నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ సభకు పెదకూరపాడు నియోజక వర్గం నుంచి ప్రజలు వేలాదిగా తరలిరావాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పిలుపునిచ్చారు. క్రోసూరు మార్కెట్‌యార్డులో టీడీపీ ముఖ్య నాయకులతో ఆయన సమావేశం అయ్యారు. రూ.54 వేల కోట్ల వ్యయంతో చేపట్టే పనులను ప్రధాని ప్రారంభిస్తారని చెప్పారు. హైకోర్టు, సచివాలయం, అసెంబ్లీ భవనం, ఎమ్మెల్యేల, అధికారుల, న్యాయాధికారుల, మంత్రుల నివాస గృహాలకు పలు ప్రదేశాల్లోని రహదారులకు, సెంట్రల్ లైటింగ్‌లకు, భూగర్భ కేబుల్స్ నిర్మాణాలకు ప్రధాని శంకుస్థాపనలు చేయనున్నట్టు తెలిపారు. కూటమి పార్టీల నాయకులు సభను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనేకమంది టీడీపీ మండల నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



బెల్లంకొండ: టీడీపీ నాయకులతో చర్చిస్తున్న గుంటూరు మిర్చియార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి

జన సమీకరణకు మూడు టీడీపీ టీమ్‌ల పర్యటన

అచ్చంపేట, మే 1(ఆంధ్రజ్యోతి): అమరావతిలో జరగనున్న మోదీ బహిరంగ సభకు జన సమీకరణ కోసం టీడీపీ శ్రేణులు మూడు విభాగాలుగా ఏర్పడి అచ్చంపేటలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ టీంల సభ్యులు గ్రామ గ్రామాన తిరుగుతూ సభను విజయవంతం చేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులను కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, పాటిబండ్ల బాపిరాజు, గంధం కోటేశ్వరరావు, పసుపులేటి పాపిరెడ్డి, బత్తుల శ్రీనివాసరావు, మొక్కపాటి గిరిబాబు, పోట్ల శ్రీనివాసరావు, బాష్యం చక్రవర్తి, అర్తిపట్ల వంశీకృష్ణ, గాదె మల్లిఖార్జున, కోట చంటి సుడిగాలి పర్యటనలో పాల్గొన్నారు.

30వేల మందికి అల్పాహార ఏర్పాట్లు

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): అమరావతిలో ప్రధాని మోదీ బహిరంగ సభకు పల్నాడు జిల్లా నుండి 600 బస్సులలో తరలివెళ్లే 30వేల మందికి అల్పాహారం అందించేందుకు మండలంలో మూడు స్టాల్స్ ఏర్పాటుచేశారు. సత్తెనపల్లి వైపు నుండి అమరావతి మీదుగా వెళ్లేవారికి లింగాపురం-అమరావతి మధ్య రెండుస్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. అమరావతి నుండి రాజధాని అమరావతికి వెళ్లే వారికోసం పెదమద్దూరు వద్ద ఒక స్టాల్‌ను ఏర్పాటుచేశారు. పల్నాడు డీఎస్‌వో డీ నాగముని, ఎస్ఎస్పీ ఈఈ మురళీధర్ పర్యవేక్షణలో ఏడుగురు తహసీల్దార్లు తమ సిబ్బందితో ఆహార పంపిణీ కార్యక్రమం చేపడుతున్నారు. ముందుగా టోకెన్లు ఇచ్చి వాటిద్వారా ఆహారం అందిస్తారు. గురువారం ఏర్పాట్లను డ్వామా పీడీ సిద్దలింగమూర్తి, పెదకూరపాడు ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, అమరావతి, పెదకూరపాడు తహసీల్దార్‌లు డానియేలు, ధనలక్ష్మీలు ఏర్పాట్లను పరిశీలించారు.

మహిళలు భారీగా తరలిరావాలి: వెన్నా

బెల్లంకొండ, మే 1(ఆంధ్రజ్యోతి): అమరావతిలో ప్రధాని మోదీ సభకు భారీగా మహిళలు తరలిరావాలని గుంటూరు మిర్చియార్డు మాజీ చైర్మన్, రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి వెన్నా సాంబశివారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పాపాయపాలెంలో కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం నుంచి మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు సుమారు ఐదువేల మందికి మించిరావాలని కోరారు. ప్రతి గ్రామానికి బస్సులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు అక్కల వెంకటరామిరెడ్డి, అక్కల సుబ్బారెడ్డి, గుడిసె కొండయ్య, ఓర్సు ఆనంద్, పాపాయపాలెం సర్పంచ్ ప్రసాదరావు, మాజీ ఎంపీపీ ఏడుకొండలు, అధ్యక్షుడు ఇబ్రహీం, వెంకటరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

మోదీ సభకు ఆర్టీసీ బస్సులు

పెదకూరపాడు, మే 1(ఆంధ్రజ్యోతి): అమరావతిలో జరిగే ప్రధాని మోదీ సభకు వెళ్లేందుకు పెదకూరపాడు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులు ఉంచారు. శుక్రవారం ఉదయం ఈ బస్సులు ఆయా గ్రామాలకు వెళ్ళి సభకు ప్రజలతో వెళ్ళనున్నాయి. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లను చేశారు.

● అమరావతి సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కార్యాలయ ప్రతినిధి కొండవీటి పాపారావు కోరారు. మండలంలోని 20 గ్రామాల్లో మండల పార్టీ నేతలతో కలసి సుడిగాలి పర్యటన చేశారు. ఆయా గ్రామాల పార్టీ నేతలతో సమీక్షించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, తెలుగు రైతు జిల్లా ప్రధానకార్యదర్శి భాష్యం ఆంజనేయులు, కార్యనిర్వాహక కార్యదర్శి పరుచూరి పూర్ణచంద్రరావు, టీడీపీ మండల నేతలు పాల్గొన్నారు.

● మోదీ సభకు మహిళలు అధిక సంఖ్యలో తరలిరావాలని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ ముంతాజ్ కోరారు. పెదకూరపాడులో గురువారం మహిళలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా నేత కల్పన తదితరులు పాల్గొన్నారు.



సిద్ధమైన సభా వేదిక

భద్రత కట్టుదిట్టం

గుంటూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. రాజధాని ప్రాంతమంతా గడిచిన రెండు రోజులుగా పోలీస్ వలయంలో ఉంది. 6 వేల మంది పోలీస్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం చివరి క్షణంలో మరో 300 మంది అదనపు బలగాలని రప్పించారు. ప్రధాని పర్యటించే ప్రాంతంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రధాని పాల్గొని బహిరంగ సభకు హాజరయ్యే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఎక్కడా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండడానికి కొన్ని వాహనాలకు సంబంధించి పలుచోట్ల ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు. ఆయా నిబంధనలు శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అమలులో ఉంటాయని పోలీసు అధికారులు తెలిపారు.

వేదిక చుట్టూ ఎస్పీజీ, గ్రేహౌండ్స్

ప్రధాని నరేంద్రమోదీ పాల్గొనే బహిరంగ సభ వేదిక చుట్టూ ఎస్పీజీ బలగాలతో పాటు గ్రేహౌండ్స్ పూర్తి అప్రమత్తంగా పహారా కాయనున్నాయి. వీరి తర్వాత వేదిక చుట్టూ షూటర్స్ డేగకళ్లతో పరిస్థితులను నిశితంగా గమనిస్తూ ఉంటారు. ఆ తర్వాత ఆర్మ్డు రిజర్వు, ఏపీఎస్పీ బలగాలు విధుల్లో ఉంటాయి. ప్రతి గ్యాలరీ వద్ద సాయుధ బలగాలు నిఘా వేయనున్నాయి.

సభకు వచ్చే మార్గాల వివరాలు

కార్యక్రమానికి వీఐపీలకు ప్రత్యేక రూట్ మ్యాప్ ఇచ్చారు. ప్రకాశం బ్యారేజీ, స్నూ బ్రిడ్జి, ఉండవల్లి గుహలు దాటిన తర్వాత కుడివైపు తీసుకుని సబ్ స్టేషన్ రోడ్డులో నుంచి కరకట్ట రోడ్డు మీదగా సీడ్ యాక్సెస్ రోడ్డులోకి వెళ్లి అక్కడి నుంచి వీఐపీ పార్కింగ్‌లోకి వెళ్లాల్సి ఉంటుంది.

- కాజా టోల్గేట్ సర్వీస్ రోడ్డు నుంచి మురుగన్ హోటల్ వద్ద ఎడమవైపు తీసుకుని వెస్ట్ బైపాస్ మీదగా పార్కింగ్‌లోకి వెళ్లాలి. ఈ మార్గంలో గుంటూరు నుంచి 1800, పల్నాడు నుంచి 500 బాపట్ల నుంచి 350 ప్రకాశం నుంచి 190 వాహనాలు రానున్నాయి.
- గుంటూరు నుంచి తాడికొండ అడ్డరోడ్డు, తాడికొండ, పెదపరిమి, తుళ్లూరు అయ్యప్పస్వామి దేవాలయం నుంచి ఈ సెవెన్ జంక్షన్ మీదగా కేటాయించిన పార్కింగ్‌లోకి వెళ్లాలి. ఈ రోడ్డులో గుంటూరు నుంచి 700 వాహనాలు రానున్నాయి.
- అమరావతి వైపు నుంచి పెదమద్దూరు, వైకుంఠపురం, బోరుపాలెం, దొండపాడు, రాయపూడి, రాయపూడి వై జంక్షన్ నుంచి ఎమ్మెల్యే క్వార్టర్స్ మీదగా న్యూ పార్క్ రోడ్డులో నుంచి పార్కింగ్‌లోకి వెళ్లాలి. ఈ మార్గంలో పల్నాడు జిల్లా నుంచి 600 వాహనాలు రానున్నాయి.
- వీవీఐపీ వాహనాలకు ప్రకాశం బ్యారేజ్ - లోటస్ పాయింట్ - కరకట్ట, సీడ్ యాక్సెస్ రోడ్(ఈ3) - ఎన్9 జంక్షన్ - సభా ప్రాంగణానికి చేరుకుని పీ8, పీ9 సెక్టార్లలో పార్కింగ్ చేయాలి.
- సభా ప్రాంగణం - ఈ3 రోడ్డు - కరకట్ట రోడ్డు - ప్రకాశం బ్యారేజ్ ద్వారా విజయవాడ వెళ్లవచ్చు.
- అత్యవసర సేవలకు సంబంధించిన వాహనదారులు సభా ప్రాంగణం - ఎన్9 జంక్షన్ - కురగల్లు - నిడమర్రు - మంగళగిరి నుంచి వెళ్లవచ్చు.







నవశకానికి.. నేడే నాంది

(5వ పేజీ తరువాయి)

వరాల జల్లు కురిపించేలా మోదీ హామీలు ఇస్తారని చాలామంది ఆశిస్తున్నారు.

మంత్రుల సమీక్షలు..

గురువారం సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్లో మంత్రుల కమిటీ సమావేశం నిర్వహించింది. పర్యవేక్షణ అధికారులతో మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్ సమావేశమయ్యారు. ఏడీజీ మధుసూదన్‌రెడ్డి, ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠితో మంత్రి నారాయణ సమావేశమై కార్యక్రమానికి వచ్చే ప్రముఖులు, సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. వివిధ జిల్లాల నుంచి ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండడంతో ఆయా జిల్లాల కలెక్టర్లతో మంత్రి నారాయణ టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇక రాజధానిలో జరిగే ఈ కార్యక్రమానికి అందరూ తరలి రావాలని, రాజధాని రైతులు ఇంటింటికీ తిరిగి ఆహ్వానిస్తున్నారు.

విధ్వంసం నుంచి పునర్వికాసం

(5వ పేజీ తరువాయి)

సంబంధించిన పనులు, అనుబంధ పనులను నిర్దేశించుకున్నారు. రూ.49 వేల కోట్ల పనులకు సంబంధించి టెండర్లు పిలిచారు. గృహ, భవన నిర్మాణ పనులకు సంబంధించి రూ.12,700 కోట్లతో టెండర్లు ఆహ్వానించారు. ఐకానిక్ బిల్డింగ్స్ కేటగిరీలో సచివాలయ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు భవనాలతో పాటు ప్రజాప్రతినిధులు, అఖిల భారతస్థాయి అధికారుల భవనాలు ఉన్నాయి. రాజధానిలో కీలకమైన ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం రూ.16,200 కోట్లతో టెండర్లు పిలిచారు. ఇందులో ఆర్టీరియల్ రోడ్లు, సబ్ ఆర్టీరియల్ రోడ్లు, ఫ్లడ్ మిటిగేషన్ పనులు ఉన్నాయి. ఎల్పీఎస్ ఇన్ఫ్రా కింద రూ.20,100 కోట్లతో పనులకు టెండర్లు పిలిచారు. రైతులకు ఇవ్వాల్సిన లే అవుట్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, అండర్‌గ్రౌండ్ యుటిలిటీ నెట్‌వర్క్ వంటి అనేక పనులు వీటిలోనే ఉంటాయి.

ఇప్పటివరకు రూ.26 వేల కోట్ల సమీకరణ

రాజధాని నిర్మాణ పనులకు సంబంధించి ఇప్పటివరకు రూ.26 వేల కోట్ల మేర సమీకరించారు. ప్రపంచ బ్యాంకు నుంచి రూ.15 వేల కోట్లు రుణం మంజూరైంది. హడ్కో కూడా రూ.11 వేల కోట్లు ఇచ్చింది. కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్ల రుణం మంజూరు కావాల్సి ఉంది. ఇప్పటికే టెండర్లు పిలిచిన వాటికి, పిలవాల్సిన వాటికి సంబంధించి ఇంకా రూ.74 వేల కోట్ల నిధులు కావాల్సిన అవసరం ఉంది. కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్లు వస్తే మరో రూ.69 వేల కోట్లు అవసరమవుతాయి. ఈ నిధుల కోసం డొమెస్టిక్ అండ్ ఇంటర్నేషనల్ బాండ్ మార్కెట్ ద్వారా, మల్టీలేటరల్ ఏజెన్సీలు, బ్యాంకుల ద్వారా, కేంద్ర ప్రభుత్వ సాయం, పబ్లిక్ అండ్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ), భూ విక్రయాలు (ల్యాండ్ మానిటైజేషన్) వంటి మార్గాల ద్వారా సీఆర్డీఏ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.


ఇలా చేరుకోవచ్చు..

వెలగపూడిలో జరిగే సభకు వచ్చే వారికి అనుకూలమైన రహదారులను అధికారులు అందంగా తీర్చిదిద్దారు. ఎంవీఐపీ, వీవీఐపీ, వీఐపీలకు కరకట్ట, సీడ్ యాక్సెస్ రోడ్లను సిద్ధం చేశారు. విజయవాడ వైపు నుంచి వచ్చేవారి కోసం సీడ్ యాక్సిస్ రోడ్డు, ఎన్-9 రోడ్డును సిద్ధం చేశారు. మంగళగిరి నుంచి వచ్చేవారి కోసం వెస్ట్ బైపాస్ నుంచి ఈ-11 రోడ్డు మీదగా నిడమర్రు, కురగల్లు నుంచి వెలగపూడికి చేరుకోవచ్చు. తాడికొండ మీదగా వచ్చేవారు ఎన్-9 రోడ్డు మీదగా సభావేదికకు చేరుకోవచ్చు. సభా ప్రాంగణానికి సమీపంలోనే పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. అక్కడే తాగునీరు, మజ్జిగ, ఆహార సదుపాయాలు కల్పించారు. జిల్లాల వారీగా బస్సులకు రూట్‌మ్యాప్‌లు ఇచ్చేశారు. ఉదయం 11 గంటలకే బస్సులు వెలగపూడి చేరుకునేలా ప్రణాళిక రూపొందించారు. ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడకుండా కీలకమైన ఐఏఎస్ అధికారులకు బాధ్యతలు కేటాయించారు.

ప్రధాని సభకు 1,900 బస్సులు

- అన్ని ఆర్టీసీ డిపోల నుంచి ఏర్పాటు
- రాష్ట్ర వ్యాప్తంగా అమరావతికి తరలివస్తున్న ప్రజలు
- సాధారణ ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

గుంటూరు, మే 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాజధాని అమరావతి పునఃప్రారంభోత్సవానికి విచ్చేస్తోన్న ప్రధాని నరేంద్ర మోదీ సభకు ఆర్టీసీ సమాయత్తమైంది. మొత్తం 1,900 బస్సులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందు కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఇతర డిపోల నుంచి బస్సులని సమకూర్చింది. అటు విశాఖ, శ్రీకాకుళం నుంచి ఇటు అనంతపురం, కడప, కర్నూలు వంటి ప్రాంతాల డిపోల నుంచి బస్సులను అమరావతి సభకు ఏర్పాటు చేశారు. ప్రధాని సభకు వెళ్లాల్సిన బస్సులు గురువారం రాత్రికే గుంటూరు చేరుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు సభకు తరలిరానున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాలకు శుక్రవారం ఉదయానికి చేరుకునేలా ఏర్పాటు చేశారు. జన సమీకరణకు సంబంధించి ముందుగానే ఆయా ప్రాంతాల జాబితాలను అధికారులు సిద్ధం చేశారు. మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల నుంచి బస్సుల్లో ప్రజలను తీసుకొచ్చేలా ప్రణాళి కలు వేస్తున్నారు. ప్రజల్ని సభకు తీసుకురావడం.. అనంతరం గమ్యస్థానాలకు చేర్చడం వరకు మానిటరింగ్ చేసేలా ప్రత్యేక అధికారులను నియమించారు. బస్సులు కండిషన్‌లో ఉండేలా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పించిన అమరావతి పునఃప్రారంభోత్సవానికి తరలివచ్చేందుకు ప్రజలు కూడా ఎంతో ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతోన్న నేపథ్యంలో ప్రత్యక్షంగా సభను తిలకించేందుకు ఎంతో ఆశ పడుతున్నారు.



మోడీ సభకు తరలి వెళ్లేందుకు పెదకూరపాడు ఆర్టీసీ బస్టాండ్‌లో వేచి ఉన్న బస్సులు

సాధారణ ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా..

సాధారణ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు గుంటూరు జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో) ఎం.రవికాంత్ తెలిపారు. ఇందుకోసం 30 నుంచి 40 శాతం బస్సులు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. వేసవి కారణంగా పెద్దగా ప్రయాణికుల రద్దీ లేదని పేర్కొన్నారు. అయినప్పటికీ వారికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సర్వీసులు కల్పిస్తున్నామని, ప్రత్యేకంగా సిబ్బంది కేటాయించి పర్యవేక్షిస్తామని తెలిపారు.

యూపిక్స్.. ఐపీ

లబోదిబోమంటున్న బాధితులు

రూ.2.72 కోట్లు ఆస్తులు.. రూ.155.95 కోట్లు అప్పులు

నరసరావుపేటకు చెందిన ఐదుగురి పెట్టుబడి రూ.65.5 కోట్లు

నరసరావుపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీల ఆశచూపి భారీగా పెట్టుబడులు సేకరించిన యూపిక్స్ క్రియేషన్స్ యానిమే షన్ సంస్థ నిర్వాహకుడు నిడుమోలు వెంకటసత్యలక్ష్మీకిరణ్ ఇటీవల బోర్డు తిప్పేశాడు. ఈ సంస్థ బాధితుల్లో నరసరావుపేట వాసులే ఎక్కువగా ఉన్నారు. విజయవాడకు చెందిన ఇతడు తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ కోర్టులో ఐపీ పిటిషన్‌ను దాఖలు చేశాడు. 2014లో సంస్థను ఏర్పాటు చేసి రూ.155.95 కోట్లు పెట్టుబడులుగా సేకరించినట్లు 102 మంది జాబితాను కిరణ్ కోర్టుకి సమర్పించాడు. నరసరావుపేట వారితో పాటు విజయవాడ, గుంటూరు, హైదారాబాదు తదితర ప్రాంతాల వారు కూడా కిరణ్ సంస్థలో బాధితులుగా ఉన్నారు. నరసరావుపేటకు చెందిన ఓ వ్యక్తి రూ.15 కోట్లు, మరో వ్యాపారి 15.50 కోట్లు, ఇంకో వ్యక్తి రూ.5 కోట్లు, మరొకరు రూ.18 కోట్లు, ఇంకొకరు రూ.12 కోట్లు, మరికొందరు రూ.కోటి నుంచి నాలుగు కోట్ల వరకు సదరు సంస్థలో పెట్టుబడులు పెట్టారు. మూడేళ్లలో ఓ పథకం ప్రకారం దాదాపు రూ.400 కోట్లు పెట్టుబడులు సేకరించి సంస్థను మూసి వేశాడు. రూ.2.72 కోట్లు మాత్రమే ఆస్తులు, రూ.155.95 కోట్లు అప్పులు ఉన్నట్లు ఐపీ పిటిషన్ దాఖలు చేయడంతో మిగతా సొమ్మును ప్రస్తావించలేదని బాధితులు వాపోతున్నారు. ఐపీ పిటిషన్‌లో నరసరావుపేటకు చెందిన వారి కొందరి పేర్లు లేనట్లుగా బాధితులు తెలిపారు. ఇటీవల వరకు కొంతైనా సొమ్ము తిరిగి వస్తుందన్న బాధితులు ఆశలపై కిరణ్ నీళ్లు చల్లాడు. అప్పులు చేసి సదరు సంస్థలో పెట్టుబడులు పెట్టిన ఇద్దరు వ్యాపారులు వారి ఆస్తులు విక్రయించి బాకీలు తీరుస్తున్నట్లు తెలిసింది. ఈ సంస్థలో పెట్టుబడులు పెట్టి నష్టపోయిన నరసరావుపేటకు చెందిన ఓ వ్యక్తి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే.

ఎడ్ల పందేలతో ఒంగోలు జాతికి పూర్వవైభవం

మంత్రి బీసీ జనార్దనరెడ్డి

పొన్నూరు టౌన్, మే, 1 (ఆంధ్రజ్యోతి): ఎడ్ల పందేలతో ఒంగోలు జాతికి పూర్వపు వైభవం వస్తుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ధూళిపాళ్ల వీరయ్యచౌదరి మెమోరియల్ జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభ రాజాల బలప్రదర్శన పోటీలు ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సాంప్రదాయ పూజలు చేసి, పోటీలను ప్రారంభించారు. అతిథులు ఎమ్మెల్సీ బీద రవిచంద్రయాదవ్, పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి, టంగుటూరు ఎమ్మెల్యే ఇంటూరు నాగేశ్వరరావు ప్రాంగణంలోని ఎన్టీఆర్, వీరయ్యచౌదరి విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. తొలిరోజు రాష్ట్ర నలుమూలల నుంచి 17 జతల ఎడ్లు టచ్ పళ్ల విభాగంలో 600 కిలోల బండను హోరాహోరీగా లాగాయి. సందర్భంగా జరిగిన సభలో మంత్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రైతు సోదరులను ప్రోత్సహించేందుకు ఎడ్ల పందేలు నిర్వహిస్తున్నారని, మండు వేసవిలో వడ్లమూడిలో పందేలు నిర్వహించడం సాహసోపేతమన్నారు. ప్రతి గ్రామంలో పూర్వం దూలపు ఎడ్లను పెంచి పందేలు నిర్వహించడం ద్వారా రైతులకు గుర్తింపు వచ్చేదన్నారు. ప్రస్తుతం అలాంటి గుర్తింపు తీసుకువచ్చేలా వీరయ్యచౌదరి మెమోరియల్ కృషిచేస్తుందన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఎన్టీఆర్, తన తండ్రి వీరయ్యచౌదరి పేరుతో ఎడ్ల పందేలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపోటములను సమానంగా తీసుకుని ప్రతి రైతు ఒంగోలు జాతిని సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు.



బరిలో బండ లాగుతున్న ఎద్దులు



ఎద్దుల రైతులకు బహుమతులు అందజేస్తున్న మంత్రి బీసీ జనార్దనరెడ్డి, ఎమ్మెల్యే నరేంద్రకుమార్

రాజధాని రైతుల కన్నీళ్లకు చెక్

ప్లాట్లలో మౌలిక సదుపాయాలకు రూ.20 వేల కోట్లు

ఐదేళ్ల వైసీపీ హయాంలో విధ్వంసంతో భూ దాతలకే ఎక్కువ నష్టం

ఈ సారి ఆ తప్పు జరగనివ్వకుండా ప్రథమ ప్రాధాన్యం రైతులకే

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

అమరావతిని రాజధానిగా ప్రకటించిన తర్వాత ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలని గత టీడీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కార్యరూపం దాల్చడానికి అమరావతి ప్రాంత రైతుల సహకారం ఎనలేనిది. ఎంతో పెద్ద మనసు తో 34 వేల ఎకరాలను పైసా ఆశించకుండా ఇచ్చారు. అయితే వైసీపీ ప్రభుత్వ పాలనలో రాజధాని విధ్వంసా నికి గురి కావడంతో భూములిచ్చినందుకు రైతులు ఎంతో నష్టపోవాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు మంచి జరగబోతోంది. రైతులకు ప్యాకేజీ కింద ఇవ్వాల్సిన రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లను కేటాయించినా వాటికి తగ్గ మౌలిక సదుపాయాల కల్పన జరగలేదు. ఈ సారి ఆ తప్పు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం ఎల్పీఎస్ ఇన్ఫ్రా(రైతుల ప్లాట్లలో మౌలిక సదుపాయలు) కింద రూ.20 వేల కోట్లను ఖర్చు చేస్తోంది. రెండేళ్లలోనే రైతులకు ప్లాట్లు కలిగిన లే అవుట్లు అన్నీ అభివృద్ధి చెందనున్నాయి. రాజధాని అభివృద్ధి కోసం భూ సమీకరణ విధానాన్ని జనవరి 1, 2015న ప్రభుత్వం ప్రవేశపెట్టింది. స్థానిక రైతులు, ప్రజల అభిప్రాయాల ఆధారంగా భూ సమీకరణ ముసాయిదా అనంతరం సీఆర్ డీఏ అధికారులు భూ సమీకరణలో మార్పులు చేశారు. ప్రభావిత కుటుంబాలకు మరింతగా ప్రయోజనాలు, పరిహార ప్యాకేజీలను ప్రకటించింది. భూ సమీకరణ పథకంలో చేసిన సవరణలతో రాజధాని ప్రాంత రైతులు తమ భూములను రాజధాని నిర్మాణం కోసం ఇచ్చేందుకు అంగీకరించారు.

విజయవంతమైన మోడల్..

భూ సమీకరణ విధానం ప్రపంచంలోనే టాప్ మోడల్‌గా నిలిచింది. ఈ విధానాన్ని దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా పరిశీలిస్తున్నాయంటే క్షేత్రస్థాయిలో ఎంత విజయవంతమైందో అర్థమౌతోంది. ల్యాండ్ పూలింగ్ విధానం అనేది భూమిని తీసుకోవటం మాత్రమే కాదని, భవిష్యత్తును సమిష్టిగా నిర్మించే విధాన మని ప్రభుత్వం ప్రపంచానికి చూపించింది. రాజధానిలో 29,000 మంది రైతులు స్వచ్ఛందంగా 34,000 ఎకరాలకు పైగా భూమిని రాజధాని నిర్మాణం కోసం ఇచ్చారు. అమరావతిని దేశం లోనే మొట్టమొదటి ప్రజల భాగస్వామ్యంతో నిర్మిస్తున్న రాజధానిగా నిలిపారు. రాజధానికి భూములిచ్చిన రైతులకు పారదర్శకంగా 65,000కి పైగా ఈ - లాటరీ విధానంలో రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు.

జాప్యంతో.. నష్టపోయిన రైతులు

రైతులకు ప్యాకేజీ కింద ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లు కలిగిన లే అవుట్లను సకల సదుపాయాలతో అభివృద్ధి చేయాల్సి ఉండగా.. అప్పట్లో ఈ పనుల విషయంలో కొంత జాప్యం జరిగింది. ఆ తర్వాత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి వినాశనంతో అందరికంటే ఎక్కువగా రైతులు ఇబ్బందులు పడ్డారు. గత తప్పిదాలను పునరావృత్తం కానీయకుండా ఉండేందుకు ఈ సారి ప్రభుత్వం లేఅవుట్ల, ప్లాట్ల అభివృద్ధికి రూ.20 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. రెండేళ్లలో ఈ పనులు పూర్తి కానున్నాయి.

ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు శ్రీకారం

రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు సీఆర్డీఏ అధికారులు చర్యలు చేపట్టారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయడానికి, రాజధాని రైతులకు అందుబాటులో ఉండేలా అమరావతిలో 11 యూనిట్ ఆఫీసులను, తొమ్మిది ప్రాంతాలలో ప్లాట్ల రిజిస్ట్రేషన్ కేంద్రాలను సీఆర్డీఏ ప్రారంభించింది. అమరావతి నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు ఇచ్చే వార్షిక కౌలు ప్రకటించింది. భూమిలేని పేదలకు ప్రతి నెలా రూ.5 వేల పెన్షన్‌ను ప్రభుత్వం అందిస్తోంది. రైతుల పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణలను అందిస్తూ వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది.



పల్నాడు వార్తలు

● నరసరావుపేట ● వినుకొండ ● చిలకలూరిపేట

చికిత్స పొందుతూ వివాహిత మృతి

నరసరావుపేట లీగల్, మే 1 (ఆంధ్రజ్యోతి): మానసిక పరిస్థితి సరిగా లేక ఎలుకల మందు తిని చికిత్స పొందుతూ గురువారం పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో వివాహిత మృతి చెందింది. రెండో పట్టణ పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని పెద్ద చెరువు తొమ్మిదో లైన్‌లో నివసిస్తున్న రాజ్యలక్ష్మి (30), మానసిక పరిస్థితి సరిగా లేక గత నెల 27వ తేదీన ఎలుకల మందుతిని పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి భర్త ఇద్దరు సంతానం ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు మృతురాలి భర్త నుంచి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

19 నుంచి నందమూరి కళాపరిషత్ నాటక పోటీలు

వినుకొండ, మే 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19, 20, 21 తేదీల్లో నందమూరి కళాపరిషత్ ఆధ్వర్యంలో నాటక పోటీలు నిర్వహిస్తున్నట్లు పరిషత్ కార్యనిర్వాహకులు ముత్తినేని గిరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 19వ తేదీన సోమవారం 2 నాటికలు, 20వ తేదీ మంగళవారం 3 నాటికలు, 21వ తేదీ బుధవారం 3నాటికలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బొల్లా వెంకటకోటయ్య, నలబోలు రామకోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



నరసరావుపేట రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

నరసరావుపేట రైల్వేస్టేషన్లో విస్తృత తనిఖీలు

నరసరావుపేట లీగల్, మే 1 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం ఘటనల నేపథ్యంలో నరసరావుపేట ఆర్పీఎఫ్, జీఆర్‌పీ పోలీసుల ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో రైల్వే స్టేషన్ పరిసరాలు, ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ నెల 2న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రానికి రానున్న నేపథ్యంలో పటిష్ట భద్రతా చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్ఐ వి.శ్రీనివాసరావు నాయక్ తెలిపారు. తనిఖీల్లో నరసరావుపేట జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చౌదరయ్య స్కూల్లో 4న మెగా వైద్య శిబిరం

చిలకలూరిపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీ క్లబ్ అఫ్ పండరీపురం, గుంటూరు కిమ్స్ శిఖర హాస్పిటల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటలు వరకు స్థానిక సాదినేని చౌదరయ్య స్కూలులో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు రోటరీ క్లబ్ అధ్యక్షుడు వారణాసి శరత్‌కుమార్, కార్యదర్శి కొల్లా సుబ్బారావు, సభ్యులు అలంగార్ మోహన్ గురువారం తెలిపారు. గుంటూరు కిమ్స్ హాస్పిటల్‌కు చెందిన 15మంది వైద్య నిపుణులు ఈ శిబిరంలో పాల్గొని రోగులను పరీక్షిస్తారని తెలిపారు. చిలకలూరిపేట ప్రాంతానికి చెందిన ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు

నూజెండ్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రవ్వవరం, సాయినగర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సీడబ్ల్యూఎస్ఎన్ జిల్లా కో-ఆర్డినేటర్ సెల్వరాజు, ఎల్ఎస్ కో-ఆర్డినేటర్ ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. 40రోజుల ప్రత్యేక కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి సర్వే చేయటం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీ ఎంవీ రంగారావు, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పాఠశాల 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

రొంపిచర్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెంలో ఏపీ మోడల్ పాఠశాలలో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి ప్రవేశ పరీక్షా ఫలితాలు విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ రవి నాయక్ గురువారం తెలిపారు. పాఠశాలలోని నోటీసు బోర్డులో అందుబాటులో ఉన్నాయన్నారు. ఉప్పురి వెంకటత్రిలోక్ 93 మార్కులు, నంబుల లహరి 91మార్కులు సాధించారన్నారు. ప్రభుత్వ రిజర్వేషన్ నియమ నిబంధనలు అనుసరించి ఎంపిక చేస్తామన్నారు.

చీకటీగలపాలెంలో...

వినుకొండ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 21వ తేదీన నిర్వహించిన చీకటీగలపాలెం ఏపీ మోడల్ పాఠశాల 6వ తరగతి ప్రవేశ పరీక్షల్లో మండలంలోని పాత గోకనకొండ ఏకో ఉపాధ్యాయ పాఠశాలకు చెందిన కుంచాల సృజన 83 మార్కులతో మోడల్ పాఠశాలలో మొదటి ర్యాంక్ సాధించింది. ఆదే పాఠశాలకు చెందిన మరో ముగ్గురు విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా కుంచాల అశ్విని 69మార్కులతో 10వ ర్యాంక్, గుంటకల మణికంఠ-48మార్కులు, గుంటకల అపూర్వ 45మార్కులు, పరీక్షలకు హాజరైన నలుగురు విదార్థులు మోడల్ పాఠశాల్లో సీట్లు సాధించటంపై పాత గోకనకొండలో గురువారం స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఉపాధ్యాయుడు తుంగ శ్రీనివాసరావును విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కార్మికుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



కార్మికులకు, నిరుపేదలకు పులిహోర పంపిణీ చేస్తున్న చీఫ్‌విప్ జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన తదితరులు



మేడే సందర్భంగా వినుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

వినుకొండ, మే 1 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని, పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం కల్పిస్తోందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద టీఎన్‌టీయూసీ కార్యాలయంలో ప్రపంచ కార్మికుల దినోత్సవంలో భాగంగా మేడే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు టీఎన్‌టీయూసీ జెండాను ఆవిష్కరించి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్మికులకు, నిరుపేదలకు పులిహోర పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ కార్మికులకు ఇది పండుగ దినమని, కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని, కార్మికులకు నూతనంగా ఇన్సూరెన్స్ సౌకర్యం తీసుకురావడం శుభపరిణామన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పి వారికి రావాల్సిన హక్కులను కాలరాసిందని ఈ సందర్భంగా మండిపడ్డారు. కార్మికుల నిధులను దోచేశారని, కార్మికుల సంక్షేమానికి కేటాయించిన నిధులను సైతం వాడుకున్నారని, ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మికులు ఆశించిన విధంగా ఇది కార్మికుల సంక్షేమ ప్రభుత్వమని తెలిపారు. కార్మిక సోదరులకు ఎన్‌డీఏ కూటమి అండగా ఉంటామన్నారు. ఒకేరోజు రాష్ట్రవ్యాప్తంగా వందశాతం పింఛన్లు పంపిణీ చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన పార్టీ నాగ శ్రీను రాయల్, కార్మికసంఘం నాయకులు పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని నియోజకవర్గ ఏఐటీయూసీ వినుకొండ ఏరియా అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో మేడే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే పతకాలను ఆవిష్కరించి పండుగ జరుపుకున్నారు. ముందుగా మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మేడే జెండాను సీపీఐ సీనియర్ నాయకుడు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ సంద్రపాటి సైదా జెండాను ఆవిష్కరించి పట్టణంలో భారీ ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతివరప్రసాద్ మాట్లాడుతూ ఆనాడు 18గంటల పనిదినాన్ని నేడు 8గంటల పనిదినం కోసం ప్రపంచ వ్యాప్తంగా పోరాటాలు చేపట్టారన్నారు. చికాగోలో పోలీసుల కాల్పుల తూటాలకు బలైన కార్మికుల రక్తం నుంచి ఆవిష్కరించి జెండా అన్నారు. వారి త్యాగానికి గుర్తుగా మేడే జరుపుకోవడం జరుగుతుందన్నారు. 1920లో భారతదేశ కార్మిక వర్గానికి దిక్సూచిగా 8గంటల పనిదినాన్ని దేశవ్యాప్తంగా అన్నివర్గాల కార్మికులకు వర్తింపజేసి అనేక కార్మిక చట్టాలు పోరాడి సాధించి పెట్టిన ఘనత ఏఐటీయూసీదే అని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ నాయకులు బూదాల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము, రాయబారం వందనం, బూదాల చిన్నా, పిన్నెబోయిన వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్, రైల్వే ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఫ్రాన్సిస్, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పి.సాంబశివరావు, విన్సెంట్, కాజా, హరిబాబు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని పార్వతిపురంలో సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో మేడే జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు తోట ఆంజనేయులు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మేడే



మేడే సందర్భంగా నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి కే నరేంద్రరెడ్డి

వేడుకలను కష్టజీవులు అందరూ ఘనంగా జరుపుకోవడం వారి విజయానికి ప్రతీక అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి దూపాటి నాని, అందుగులపాటి వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో మేడే వేడుకలను గురువారం నిర్వహించారు. సీపీఎం గ్రామపార్టీ కార్యదర్శులు అంగలూరి ఫణీంద్ర జెండాను ఆవిష్కరించారు. సీపీఎం మండల కార్యదర్శి సరికొండ వెంకటేశ్వరరాజు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు సరైన న్యాయం చేయాలన్నారు. కార్మికుల శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ప్రపంచ కార్మిక దినోత్సవం ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో రామిరెడ్డి, వెంకటప్పారెడ్డి, మీరా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: నరసరావుపేట టీడీపీ జిల్లా కార్యాలయంలో తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మే డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. నాయీ బ్రాహ్మణ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ పాల్గొని మే డే శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్దనబాబు, జిల్లా టీఎన్‌టీసీ ప్రధాన కార్యదర్శి జాష్టి చంద్రశేఖర్ రావు, నాగార్జున, బీసీ సెల్ అధ్యక్షుడు తిరుమలకొండ నరసింహారావుతదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో మే డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. సీపీఐ కార్యాలయం వద్ద సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ప్రముఖ న్యాయవాది సీజే ప్రతాప్ అరుణ పతకాన్ని ఆవిష్కరించారు. పట్టణంలోని అన్ని పారిశ్రామిక, కార్మిక శ్రమశక్తి కేంద్రాలలో, చిత్రాల సెంటర్ రోడ్డు, హరి మిల్లు, గాంధీ నగర్, ఆర్టీసీ బస్టాండ్, సెంటర్‌లలో ఎర్ర జెండాలు ఎగరవేశారు. నరసరావుపేట ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు, ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, ఆయా సెంటర్‌లలో జెండాలు ఎగరవేశారు. అనంతరం సీపీఐ కార్యాలయం నుంచి మోర్ సెంటర్ మీదగా ఆర్డీవో కార్యాలయం, ఏఐటీయూసీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్.దేవి, ప్రసన్నకుమార్, గిరి, సుభానీ, జానీ, సుధీర్, రవి, పవన్ కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మాచర్ల కోటేశ్వరరావు, విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

● పట్టణంలో ప్రపంచ కార్మికుల దినోత్సవం మే డే సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని నినాదాలు చేశారు. వివిధ సెంటర్‌లో సీఐటీయూ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సిలార్ మసూద్, సల్మాన్, కార్మికులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: పట్టణంలో పలుచోట్ల మేడే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. సీపీఐ కార్యాలయంపై సీపీఐ పతకాన్ని, పార్టీ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ పతకాన్ని సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబూరావు ఆవిష్కరించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, గాంధీ పార్కు ఎదుట భవన నిర్మాణ కార్మికసంఘం కార్యాలయంతో పాటు పలు ప్రాంతాలతో మేడే పతాకావిష్కరణ కార్యక్రమాలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో సీపీఐ, దాని అనుబంధ సంఘాల నాయకుల షేక్ సుభాని, దాసరి వరహాలు, చెరుకుపల్లి నిర్మల, మునబోయిన వెంకటేశ్వర్లు, మల్లికార్జున్, కాసా సాంబయ్య, తుబాటి సుభాని, తాడిబోయిన సాంబయ్య, కోమరగిరి చెంచయ్య పాల్గొన్నారు.

● ఆర్టీసీ బస్సు డిపోలో ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా మేడే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘ్ నాయకులు బి.కోటేశ్వరావు, డిపో సెక్రెటరీ ఎ.వరప్రసాదరావు, జాయింట్ సెక్రెటరీ ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

● ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని సీపీఎం కార్యాలయంలోని ఏలూరు సిద్ధయ్య విజ్ఞాన కేంద్ర మందిరంలో ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మేడే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్ములు ఫ్యాషన్స్ సంస్థ వారి సహకారంతో మహిళా పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్ర బహూకరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పేరుబోయిన వెంకటేశ్వర్లు, బి.శ్రీనునాయక్, కౌన్సిలర్ వి.కోటినాయక్, పాలపర్తి శ్రీనివాసరావు, బి.చిన్న నాయక్, కొండ్రముట్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా చిలకలూరిపేట మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జడ్జి కె నరేంద్రరెడ్డి అధ్యక్షతన స్థానిక సుగాలీ కాలనీలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. కార్మిక చట్టాల గురించి, ఉచిత న్యాయ



నరసరావుపేట సీపీఐ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న కాసా రాంబాబు, సీజే ప్రతాప్ తదిరులు

సహాయం అందుకునే విధానం గురించి ఈ సందర్భంగా ఆయన వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీహెచ్ఎస్ ప్రసాద్, పి.వెంకటేశ్వరరావు, కార్మికశాఖ అధికారి బి.కోటేశ్వరరావు, ఏ శివబాబు, ఎం.భానుప్రసాద్, టి.రాజేంద్రప్రసాద్, కె.జాషువ, ఎం.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

● నూజెండ్ల: మండల కేంద్రం నూజెండ్లలో ట్రేడు యూనియన్‌ల ఆధ్వర్యంలో మేడే వేడుకలను గురువారం నిర్వహించారు. కార్మికుల కష్టానికి తగ్గ ప్రతిఫలం వచ్చేలా ట్రేడ్ యూనియన్‌లు కృషిచేస్తున్నాయని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు వివరించారు. పలు సెంటర్లలో అరుణ పతకాలను ఎగురవేశారు.



నరసరావుపేటలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న చీఫ్ వీప్ జీవీ ఆంజనేయులు, పక్కన మాజీ ఎమ్మెల్యే మక్కెన తదితరులు

అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు

● చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

బొల్లాపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి కూటమి ప్రభుత్వంలో పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. మండలంలోని పేరూరుపాడులో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం ఎంపీడీవో పీ సీతారామయ్య అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.4వేలు, రూ.6వేలు పింఛన్‌ను ఇచ్చిన ఘనత సీఎం నారా చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 65 లక్షల మందికి పింఛన్‌లు ఇవ్వటం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో ఏనాడు కూడా ప్రభుత్వ అధికారులకు 1వ తేదీన జీతాలు ఇచ్చిన పాపాన పోలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక అధికారులకు, పింఛన్‌దారులకు 1వ తేదీనే జీతాలు, పింఛన్‌లను ఇంటి వద్దనే అందజేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 175 అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేసి పేదల ఆకలి తీరుస్తోందన్నారు. నియోజకవర్గంలో సమస్యలు తెలుసుకునేందుకు ప్రతి శుక్రవారం వినుకొండలోని తన కార్యాలయంలో అందుబాటులో ఉంటున్నానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మూల స్వాతి, రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి పెమ్మసాని నాగేశ్వరరావు, కాసరగడ్డ గోవింద రాజులు, గంగినేని రామణయ్య, కాట్ల వెంకటేశ్వర్లు, గుర్రం నరసింహారావు, కాట్ల సుబ్బయ్య, బొప్పూడి శ్రీను, రావూరి నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయ అధికారి ఎం.గాయత్రి

కార్మిక చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు

నరసరావుపేట లీగల్, మే 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అసంఘటిత రంగ కార్మిక సంక్షేమ పథకాలపై, కార్మిక చట్టాలపై గురువారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయం వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయ అధికారి ఎం.గాయత్రి అసంఘటిత రంగ కార్మికులకు చట్టప్రకారం ఉన్న సౌలభ్యాలు, హక్కులు, ఉచితంగా న్యాయ సహాయం పొందే విధివిధానాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం తదితర అంశాలను వివరించారు. వివిధ సంక్షేమ పథకాలకు అర్హత, వాటిని పొందే విధివిధానాలను, దరఖాస్తు చేసుకునే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, కార్మిక శాఖ సహాయ కమిషనర్, మున్సిపల్ అధికారులు, మొదటి పట్టణ పోలీసులు, కార్మిక సంఘ ప్రతినిధులు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

కాసు వెంగళరెడ్డికి ఘన నివాళి

నరసరావుపేట టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో కాసు వెంగళరెడ్డి 45వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. పల్నాడు రోడ్డులోని కాసు వెంగళరెడ్డి విగ్రహానికి గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గజ్జల బ్రహ్మారెడ్డి, వైసీపీ సత్తెనపల్లి ఇన్‌చార్జి డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి తదితరులు నివాళి అర్పించారు. అదేవిధంగా కాసు గృహంలో అభిమానులు, కార్యకర్తలు కాసు వెంగళరెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పి.ఈశ్వరరెడ్డి, వై.రంవీర్‌దరెడ్డి, పి.చక్రారెడ్డి, కె.చెంచిరెడ్డి, కె.రాజేంద్రప్రసాద్, దుర్గాబాబు, అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కాసు వెంగళరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి తదితరులు

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల జడ్పీ పాఠశాలలో సర్దార్ కాసు వెంగళరెడ్డి వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అన్నెం పున్నారెడ్డి, పడాల చక్రారెడ్డి, కల్లి వెంకటరెడ్డి, కల్లి వెంకటప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల యాజమాన్యంతో మాట్లాడుతున్న డీఈ ప్రభాకర్‌రావు

పీఎంశ్రీ పథకంతో పాఠశాలల అభివృద్ధికి కృషి

● సమగ్రశిక్ష అభియాన్ డీఈ ప్రభాకర్‌రావు

శావల్యాపురం, మే 1 (ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ పథకంతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని సమగ్రశిక్ష అభియాన్ డీఈ ప్రభాకర్‌రావు అన్నారు. పీఎంశ్రీ పథకం ద్వారా శావల్యాపురం జడ్పీ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డీఈ మాట్లాడుతూ పల్నాడు జిల్లావ్యాప్తంగా 29మండలాలలో ఒక్కో పాఠశాల చొప్పున 29 జడ్పీపాఠశాలలను ఎంపికచేసి పాఠశాలల్లోని అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని, అన్ని పాఠశాలల్లో అభివృద్ధి పనులు తుదిదశకు చేరాయన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి అభివృద్ధి పనులను పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామన్నారు. శావల్యాపురం జడ్పీ పాఠశాలలో వాలీబాల్ కోర్టు, బ్యాడ్మింటన్ కోర్టు, లాంగ్‌జంప్ ట్రాక్, రన్నింగ్ ట్రాక్, ఇంకుడు గుంతలు, కిచెన్ షెడ్డు నిర్మాణాలను చేపట్టడం జరిగిందని, నాణ్యత ప్రమాణాలతో పనులు జరుగుతున్నాయన్నారు. వర్షాకాలంలో క్రీడాప్రాంగణంలో వర్షపునీరు నిలబడకుండా పాఠశాల యాజమాన్యం తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, సమగ్రశిక్ష ఏఈ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళలకు నిత్యావసరాల పంపిణీ

చిలకలూరిపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రముఖ సేవా సంస్థ అసిస్ట్, హైదరాబాద్‌కు చెందిన కేఎన్ఏ సంస్థలు సంయుక్తంగా గురువారం స్థానిక సుభానినగర్‌కు చెందిన 200మంది ఒంటరి మహిళలకు రూ.3లక్షల విలువ కలిగిన బియ్యం, కందిపప్పు, నూనె, గోధుమ పిండి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ అధినేత డాక్టర్ జాష్టి రంగారావు, కేఎన్ఏ సంస్థ ప్రతినిధి అస్మా, అసిస్ట్ సంస్థ అసోసియేట్ డైరెక్టర్ ఎం.విష్ణుప్రియ పాల్గొన్నారు.



ఒంటరి మహిళలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న అసిస్ట్, కేఎన్ఏ సంస్థ ప్రతినిధులు



డాక్టర్ సౌమ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ కారసాని శ్రీనివాస్ రెడ్డి తదితరులు

మహాత్మాగాంధీ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో అందుబాటులో న్యూరాలజిస్ట్ సేవలు

నరసరావుపేట లీగల్, మే 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాత్మాగాంధీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో న్యూరాలజిస్టు సేవలు అందుబాటులో ఉంటాయని డాక్టర్ కారసాని శ్రీనివాస్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గత రెండు నెలలుగా పూర్తిస్థాయి న్యూరాలజిస్ట్ అందుబాటులో లేనికారణంగా వైద్య సేవలకు అంతరాయం ఏర్పడిందని తెలిపారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ సౌమ్య గురువారం నుంచి తమ వైద్యశాలలో అందుబాటులో ఉంటారని వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ కారసాని శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. పల్నాడు ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలకు మారుపేరుగా ఉన్న మహాత్మాగాంధీ హాస్పిటల్లో కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్‌గా సేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్ ప్రసాద్, డాక్టర్ అశ్విని, డాక్టర్ నవీన్, ప్రవీణ్, విజయ రాజు తదితరులు పాల్గొన్నారు.

నిలిపివేసిన పింఛన్లు పునరుద్ధరించాలని

పోట్లూరు, పిచికలపాలెం గ్రామస్థుల ఆందోళన

శావల్యాపురం, మే 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి సానుభూతిపరులమన్న వంకతో రాజకీయ కక్షసాధింపులకు పాల్పడి ఎన్నో ఏళ్లుగా పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులకు పింఛన్లు నిలిపివేశారని మండలంలోని పోట్లూరు, పిచికలపాలెం గ్రామాలకు చెందిన బాధితులు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేశారు. పిచికలపాలెం వైసీపీ నేత తిరువీధి రమణారావు మాట్లాడుతూ పిచికలపాలెంలో 9మంది లబ్ధిదారుల ఫించన్‌లు నిలిపేశారని, అదేమని అడిగితే ఎంపీడీవో ఇవ్వవద్దన్నారని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారని వాపోయారు. గాలి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, ఓట్ల మల్లికార్జున, తిరువీధి ఆదిశేషు, ముండ్రు వెంకటరవణయ్య, అమృతపూడి అలెగ్జాండర్, కంచర్ల రమాదేవి, బాబు, అమృతపూడి పిలుపుల పింఛన్‌లను నిలిపివేశారన్నారు. పోట్లూరు వైసీపీ నేత అబ్బూరి అయ్యన్న మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో జరిగిన ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్లలో వైసీపీ తరపున ప్రభను కట్టామని కక్షగట్టి గ్రామానికి చెందిన 22మంది ఫించన్‌లను నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ హయాంలో కంటే ఎక్కువ పింఛన్లు తెచ్చి గ్రామాన్ని అభివృద్ధి చేయాలేగాని ఇలా కక్ష సాధింపులకు పాల్పడడం సరైన విధానం కాదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పింఛన్లను పునరుద్ధరించాలని కోరారు.



సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న బాధితులు